وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

బదర్
(Telugu)వార పత్రిక ఖాదియాన్
Weekly BADAR
Qadian
www.akhbarbadr.in

సంపుటి: 11    సంచిక: 25

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

తేది: 18 జూన్ 2026 క్రీ, శ. 18 ఎహ్సాన్ 1405 హి, శ. 01- ముహర్రం 1448 హి,ఖ.

## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

يٰۤاَهۡلَ الۡكِتٰبِ قَدۡ جَآءَكُمۡ رَسُوۡلُنَا يُبَيِّنُ لَـكُمۡ كَثِيۡرًا مِّمَّا كُنۡتُمۡ تُخۡفُوۡنَ مِنَ الۡكِتٰبِ وَيَعۡفُوۡا عَنۡ كَثِيۡرٍ ؕ قَدۡ جَآءَكُمۡ مِّنَ اللّٰهِ نُوۡرٌ وَّكِتٰبٌ مُّبِيۡنٌ ﴿۱۶﴾ يَّهۡدِىۡ بِهِ اللّٰهُ مَنِ اتَّبَعَ رِضۡوَانَهٗ سُبُلَ السَّلٰمِ وَيُخۡرِجُهُمۡ مِّنَ الظُّلُمٰتِ اِلَى النُّوۡرِ بِاِذۡنِهٖ وَيَهۡدِيۡهِمۡ اِلٰى صِرَاطٍ مُّسۡتَقِيۡمٍ ﴿۱۷﴾ (سورہ المائدۃ:16-17)

అనువాదం: ఓ పవిత్ర గ్రంథమును అందుకున్న ప్రజలారా! నిశ్చయముగా మా ప్రవక్త వచ్చియున్నాడు. మీరు పవిత్ర గ్రంథము నందుగల ఏ ఆంశములను దాచుచుంటిరో వాటిని అతడు స్పష్టముగా మీకు తెలియ జేయుచున్నాడు. ఎన్నిటినో అతడు క్షమించుచున్నాడు. నిశ్చయముగా మీ వద్దకు అల్లాహ్ నుండి ఒక తేజస్సు, ఒక కాంతి వంతమైన గ్రంథము వచ్చియున్నది. అల్లాహ్ ఇచ్చును అనుసరించువారిని అతడు శాంతిపథము నందు నడిపించును. తమ అజ్ఞతో వారిని మబ్బుల నుండి వెలుగుబాట వైపు తీసుకొని పోవును. వారికి సత్పథమును చూపును. (మాయిదా : 16-17)

## సోదరభావం, సామరస్యతయే ఇస్లాం యొక్క అంతర్జాతీయ్య సందేశం.

عَنۡ اَبِیۡ نَضۡرَۃَ حَدَّثَنِیۡ مَنۡ سَمِعَ خُطۡبَۃَ رَسُوۡلِ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیۡہِ وَسَلَّمَ فِیۡ وَسۡطِ اَیَّامِ التَّشۡرِیۡقِ فَقَالَ یَا اَیُّہَا النَّاسُ اَلَا اِنَّ رَبَّکُمۡ وَاحِدٌ وَاِنَّ اَبَاکُمۡ وَاحِدٌ ، اَلَا لَا فَضۡلَ لِعَرَبِیٍّ عَلٰی عَجَمِیٍّ وَلَا لِعَجَمِیٍّ عَلٰی عَرَبِیٍّ وَلَا لِاَحۡمَرَ عَلٰی اَسۡوَدَ وَلَا لِاَسۡوَدَ عَلٰی اَحۡمَرَ اِلَّا بِالتَّقۡوٰی اَبَلَّغۡتُ ؟ قَالُوۡا بَلَّغَ رَسُوۡلُ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیۡہِ وَسَلَّمَ ۔ ثُمَّ قَالَ : اَیُّ یَوۡمٍ ہٰذَا ؟ قَالُوۡا : یَوۡمٌ حَرَامٌ ، قَالَ : اَیُّ شَہۡرٍ ہٰذَا ؟ قَالُوۡا : شَہۡرٌ حَرَامٌ ، قَالَ : ثُمَّ اَیُّ بَلَدٍ ہٰذَا ؟ قَالُوۡا: بَلَدٌ حَرَامٌ ، قَالَ : فَاِنَّ اللّٰہَ قَدۡ حَرَّمَ بَیۡنَکُمۡ دِمَاءَکُمۡ وَاَمۡوَالَکُمۡ ، قَالَ : وَلَا اَدۡرِیۡ ،قَالَ اَوۡ بَلَدَکُمۡ ہٰذَا ۔ اَبَلَّغۡتُ ؟ قَالُوۡا : بَلَّغَ رَسُوۡلُ اللّٰہِ صَلَّی اللّٰہُ عَلَیۡہِ وَسَلَّمَ قَالَ : لِیُبَلِّغِ الشَّاہِدُ الۡغَائِبَ۔

(مسند احمد جلد ۵ صفحہ ۴۱۱ مسند احمد جلد ۱ صفحہ ۲۳۰ عن ابن عباسؓ)

హజ్రత్ అబూ నజర్ రజియల్లాహు తాలా అన్హు ఇలా ఉల్లేఖించారు: హజ్జతుల్ విదా సందర్భంగా మినా రోజులలో ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైంహి వసల్లం చేసిన ప్రసంగంను ప్రత్యక్షంగా విన్న ఒక వ్యక్తి నాకు ఆ విషయాన్ని ఇలా తెలిపాడు. ఆ ప్రసంగంలో ప్రవక్త ఇలా అన్నారు: "ఓ ప్రజలారా! మీ ప్రభువు ఒక్కడే, మీ తండ్రి కూడా ఒక్కడే. ఒక అరబ్బీకి అరబ్బీయేతరునిపై ఎలాంటి ప్రాధాన్యత లేదు; అలాగే ఏ అరబ్బీయేతరునికి ఒక అరబ్బీపై ఎలాంటి ప్రాధాన్యత లేదు. అలాగే తెల్లవారికి నల్లవారిపై, నల్లవారికి తెల్లవారిపై ఎలాంటి ప్రాధాన్యత లేదు. ప్రాధాన్యత మరియు గొప్పతనం కేవలం దైవభీతి (తక్వా) మరియు సత్ప్రవర్తన ద్వారానే నిర్ణయించబడుతుంది. నేను ఈ ముఖ్యమైన సందేశాన్ని మీకు చేరవేశానా?" అప్పుడు ప్రజలు గట్టిగా "అవును, అల్లాహ్ ప్రవక్త ఈ సత్య సందేశాన్ని స్పష్టంగా మాకు చేరవేశారు." అని సమాధాన మిచ్చారు: తరువాత ప్రవక్త (స) అడిగారు: "ఇది ఏ రోజు?" ప్రజలు "ఇది అత్యంత పవిత్రమైన రోజు." అని సమాధానమిచ్చారు: ప్రవక్త (స) మళ్లీ అడిగారు: "ఇది ఏ నెల?" ప్రజలు "ఇది అత్యంత పవిత్రమైన నెల (ధుల్-హిజ్జా)." అని సమాధానమిచ్చారు: తరువాత మరల ప్రవక్త (స) అడిగారు: "ఇది ఏ నగరం?" ప్రజలు "ఇది అత్యంత పవిత్రమైన నగరం (మక్కా)." అని సమాధానం ఇచ్చారు. అప్పుడు ప్రవక్త (స) ఇలా అన్నారు: " ఈ రోజు, ఈ నెల, ఈ నగరం ఎంత పవిత్రమై నవో మీ ప్రాణాలు, మీ సంపదలు ( గౌరవాన్ని కూడా ప్రస్తావించారా లేదా అన్నది కథకుడికి ఖచ్చితంగా గుర్తు లేదు) కూడ అంతే పవిత్రమైనవి మరియు గౌరవించ దగినవి. అనగా ఏ విధముగానైతే మీరు ఈ రోజు, ఈ నెల, ఈ నగరం యొక్క పవిత్రతను భంగపరచాలని ఊహించకూరో, అదే విధముగా ఇతరుల ప్రాణాలు, ఆస్తులు మరియు గౌరవాన్ని దెబ్బతీయడం కూడా నిషేధించబడింది." మరల ప్రవక్త (స) ఇలా అడిగారు: "నేను ఈ ముఖ్యమైన సందేశాన్ని మీకు చేరవేశానా?" అందుకు ప్రజలు "అవును, ఓ అల్లాహ్ ప్రవక్తా! మీరు మాకు అన్నింటినీ పూర్తిగా చేరవేశారు." అని సమాధానం ఇచ్చారు. అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం ) ఇలా అన్నారు. "ఇక్కడ హాజరై ఉన్నవారు, ఇక్కడ లేని వారికి కూడా ఈ సందేశాన్ని చేరవేయండి."

**(మస్నద్ అహ్మద్ సంపుటి 5, పేజి 411, సంపుటి 1, పేజి 230)**

## అల్లాహ్ దృష్టిలో జాతులకు, వంశాలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు.

**(ఉపదేశములు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)**

**హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ ( మిర్జా గులాం అహ్మద్ ఖాదియాని గారు) అలైహిస్సలాతు వస్సలాం ఇలా పేర్కొన్నారు:**

"అల్లాహ్ దృష్టిలో మీలో అత్యంత భక్తి (తక్వా) కలిగినవాడే, అత్యంత గౌరవనీయుడు. 'నేను సయ్యద్‌ను', 'నేను మొఘల్‌ను', 'నేను పఠాన్‌ను', లేదా 'నేను షేఖ్‌ను' అని చెప్పుకొని గొప్పగా భావించుకోవడం పూర్తిగా తప్పుడు విధానం. ఒకవేళ ఎవరైనా తాము ఉన్నత వంశానికి లేదా తెగకు చెందినవారమని గర్విస్తే, ఆ గర్వం వ్యర్థమైనది. మరణం తర్వాత ఆ జాతి, వంశ, తెగ భేదాలన్నీ అంతరించి పోతాయి. అల్లాహ్ సమక్షంలో జాతి లేదా వంశానికి ఎలాంటి ప్రాధాన్యం లేదు. కేవలం ఉన్నత కుటుంబంలో జన్మించిన కారణంగా ఎవరూ మోక్షం లేదా రక్షణ పొందలేరు. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ ఫాతిమా (రజియల్లాహు అన్హా)తో ఇలా అన్నారు: 'ఓ ఫాతిమా! నీవు ఒక ప్రవక్త కుమార్తెవని గర్వించకు.' అల్లాహ్ దృష్టిలో వంశపారంపర్యానికి విలువ లేదు. అక్కడ లభించే ఉన్నత స్థాయిలు తక్వా (దైవభీతి, నిష్టాపరతల) ఆధారంగానే లభిస్తాయి. ఈ జాతులు, తెగలు, వంశాలు ప్రపంచ వ్యవహారాల నిర్వహణ కొరకు ఏర్పడిన సామాజిక వ్యవస్థలు మాత్రమే. వాటికి అల్లాహ్‌తో ఎలాంటి సంబంధం లేదు. దైవభీతి, నిష్టాపరతల వలన అల్లాహ్ ప్రేమ పుడుతుంది మరియు అత్యున్నత ఆధ్యాత్మిక స్థాయిలను పొందడానికి కూడా తక్వానే కారణమవుతుంది."

**(అల్‌హకమ్, సంపుటి 6, సంచిక 37, దివి:1-17 అక్టోబర్ 1902 పేజె 7)**

## హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త (స) క్రైస్తవులకు తమ మస్జిద్‌లో ప్రార్థన చేసుకొనుటకు అనుమతిని ఇచ్చారు.

సయ్యదినా హజ్రత్ ముస్లేహ్ మౌవూద్ ఖలీఫతుల్ మసీహుస్సాని (రజి ) ఇస్లాం స్థాపకులైన హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి మత సామరస్యతను గూర్చి ప్రస్తావిస్తూ ఇలా పేర్కొన్నారు: " ప్రవక్త (స) మత సామరస్యతకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చేవారు మరియు ఈ విషయంలో స్వయముగా వారు కూడ అత్యున్నత ఆదర్శాన్ని చూపించారు. యెమెన్‌కు చెందిన ఒక క్రైస్తవ తెగ మతపరమైన చర్చ కోసం ప్రవక్త (స) వద్దకు వచ్చింది. వారిలో ప్రముఖ పాదరీలు కూడా ఉన్నారు. వారు మసీదులో కూర్చొని సంభాషణ ప్రారంభించారు, ఆ చర్చ చాలా సేపు కొనసాగింది. అప్పుడు ఆ బృందంలోని ఒక పాదరీ, 'ఇప్పుడు మా ప్రార్థనా సమయం అయింది; మేము బయటకు వెళ్లి మా ప్రార్థనను నిర్వహించుకొని వస్తాము' అని చెప్పాడు. అందుకు దైవ ప్రవక్త (స) ఇలా అన్నారు. 'బయటకు వెళ్లాల్సిన అవసరం ఏముంది? మీరు మా మసీదులోనే మీ ప్రార్థనను నిర్వహించుకోవచ్చు. ఎందుకంటే మా మసీదు దేవున్ని స్మరించుకోవడం కోసమే నిర్మించబడింది."


(తఫ్సీర్-ఉల్-ఖుర్ఆన్ పీఠిక, పేజి 404)

### అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు. జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేకముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన దీర్ఘాయుష్షును ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రొపరైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**హుజూర్ గారి శాంతి, సామరస్యత మరియు పరస్పరం గౌరవమర్యాదల వంటి శాశ్విత సందేశాలు ప్రపంచం మొత్తాన్ని ప్రభావితం చేస్తున్నాయి.**
**(గెగ్ స్టాఫోర్డ్ ఎంపీ)**
**అహ్మదియ్య ముస్లిం జమాఅత్ బ్రిటన్‌కు చెందిన 19వ శాంతి సదస్సు నిర్వాహణ 16 మే 2026**




**అహ్మదీయ ముస్లిం జమాఅత్ బ్రిటన్‌కు చెందిన 19 శాంతి సదస్సు 16 మే 2016వ తేదిన ఇస్లామాబాద్‌లోని మస్రూర్ భవనంలో నిర్వహించడం జరిగింది. ఈ సదుస్సులో సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా స్వయముగా పాల్గొన్నారు. హుజూర్ అన్వర్ అతిథులను ఉద్దేశించి విశ్వాసభరితమైన ప్రసంగం కూడ చేశారు. గత సంచికలో హుజూర్ గారి ప్రసంగ సారాంశాన్ని ప్రచురించడం జరిగింది. మిగిలిన నివేదికను ఈ సంచికలో ప్రచురించడం జరుగుతుంది. పై చిత్రంలో హుజూర్ అన్వర్ గారు గ్రెగోయిర్ అహోంగ్‌బోనోన్ గారికి అహ్మదీయ ముస్లిం శాంతి పురస్కారంను ప్రదానం చేయడాన్ని చూడవచ్చును.**

**2025 సంవత్సరానికి అహ్మదీయ ముస్లిం శాంతి పురస్కారం:-**

2025 సంవత్సరానికి ఆఫ్రికాలోని బెనిన్ దేశానికి చెందిన గ్రెగోయిర్ అహోంగ్‌బోనోన్ గారికి అహ్మదీయ ముస్లిం శాంతి పురస్కారం ప్రదానం చేయబడింది. పశ్చిమ ఆఫ్రికాలో మానసిక వ్యాధులతో బాధపడుతున్న ప్రజల సంరక్షణ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా ఈ పురస్కారం అందజేయబడింది. ఆయన సేవలను ప్రతిబింబించే ఒక సంక్షిప్త వీడియో ప్రదర్శించబడింది. అనంతరం, హుజూర్ గారు తమ శుభప్రదమైన హస్తాలతో ఆయనకు ఈ పురస్కారంను మరియు 10,000 ఫౌండ్ల విలువైన చెక్కును అందించడం జరిగింది. తరువాత ఆయన వేదికపైకి వచ్చి ఫ్రెంచ్ భాషలో ప్రసంగించారు. అదే సమయంలో ఆ ప్రసంగానికి సరళమైన ఆంగ్ల అనువాదం కూడా వినిపించబడింది. పురస్కారం అందుకున్నందుకు ఆయన హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసి, పశ్చిమ ఆఫ్రికాలో మానసిక ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులు ఎదుర్కొంటున్న కష్టాలను వివరించారు. చివరగా హుజూర్ అన్వర్ గారికీ, అహ్మదీయ ముస్లిం జమాత్‌కూ తన కృతజ్ఞతలు తెలిపారు.

**స్వాగత ప్రసంగం మరియు విశిష్ట అతిథుల సంక్షిప్త ప్రసంగాలు:-**

హుజూర్ అన్వర్ గారి ప్రధాన ప్రసంగానికి ముందు, యుకే అమీర్ సాహిబ్ స్వాగత ప్రసంగం చేశారు. అలాగే మరికొంత మంది విశిష్ట అతిథులు కూడా సంక్షిప్తంగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. వాటి వివరాలు క్రింద ఇవ్వబడ్డాయి.

**గౌరవనీయ రఫీక్ అహ్మద్ హయాత్ సాహిబ్ గారి స్వాగత ప్రసంగం:-**

(అమీర్, అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ యుకే)

“అందరికీ స్వాగతం పలికిన అనంతరం అమీర్ సాహిబ్ మాట్లాడుతూ, నేడు వివిధ రంగాలకు మరియు సంస్థలకు చెందిన వ్యక్తులు ఇక్కడ సమావేశమయ్యారని పేర్కొన్నారు. ప్రపంచంలో శాశ్వత శాంతిని నెలకొల్పాలంటే, అందరూ కలిసి ఐక్యత, సామరస్యం మరియు పరస్పర గౌరవాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని అన్నారు.

ప్రస్తుతం ప్రపంచం అత్యంత సున్నితమైన మరియు ప్రమాదకరమైన దశను ఎదుర్కొంటోందని ఆయన తెలిపారు. అనేక ప్రాంతాల్లో అశాంతి మరియు ఘర్షణలు కొనసాగుతున్నాయి. చిన్నారులు ప్రాణాలు కోల్పోతున్నారు. దేశాలు పరస్పరం వివాదాలు మరియు సంఘర్షణల్లో చిక్కుకున్నాయి.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్ గారు ప్రపంచవ్యాప్తంగా అనేక ముఖ్య వేదికలపై శాంతి మరియు న్యాయం గురించి ప్రసంగాలు చేశారు. వాటిలో యునైటెడ్ కింగ్‌డమ్ పార్లమెంట్, యూరోపియన్ పార్లమెంట్, వాషింగ్టన్ డి.సి.లోని క్యాపిటల్ హిల్, కెనడియన్ పార్లమెంట్, డచ్ పార్లమెంట్ మరియు న్యూజిలాండ్ పార్లమెంట్ ఉన్నాయి.

అదే విధముగా, ప్రపంచ నాయకులకు వ్యక్తిగతంగా లేఖలు రాసి, ప్రపంచం మరింత విధ్వంసం వైపు సాగకుండా ఉండేందుకు న్యాయాన్ని స్థాపించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రమాదకర కాలంలో, అనిశ్చితి మరియు భయం రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో, హుజూర్ అన్వర్ గారి శాంతి, సామరస్యం మరియు న్యాయభరిత సందేశం గతంలోకన్నా ఇప్పుడు మరింత ముఖ్యమైనదిగా, అత్యవసర శ్రద్ధకు కారకమైనది.

“మహిళలారా, పురుషులారా! చరిత్ర మనకు ఒక ముఖ్యమైన పాఠాన్ని నేర్పుతుంది. హుజూర్ అన్వర్ గారు కూడా దానిని పదేపదే మనకు గుర్తు చేస్తుంటారు. శాశ్వత శాంతిని బలప్రయోగం ద్వారా స్థాపించలేము. నిజమైన మరియు నిలకడైన శాంతి కేవలం న్యాయం, నిజాయితీ మరియు పరస్పర గౌరవం ద్వారానే సాధ్యమవుతుంది. మనం శాంతియుత ప్రపంచాన్ని చూడాలనుకుంటే, న్యాయం ప్రజలందరికి మరియు అన్ని దేశాలకు సమానంగా వర్తించాలి.

సర్వశక్తిమంతుడైన దేవుడు మానవాళిని శాంతి, న్యాయం మరియు సామరస్య మార్గంలో నడిపించుగాక. ఆమీన్."

**గ్రెగ్ స్టాఫోర్డ్ ఎంపీ**

**(ఫార్న్‌హామ్ మరియు బోర్డన్ నియోజకవర్గ పార్లమెంట్ సభ్యుడు)**

ఆయన ఇలా మాట్లాడారు:

"జాతీయ శాంతి సదస్సులో మీతో కలిసి పాల్గొనడం నాకు ఎంతో ఆనందంగా ఉంది. యునైటెడ్ కింగ్‌డమ్‌తో పాటు ప్రపంచంలోని అనేక ప్రాంతాల నుండి వచ్చిన అతిథులను నా నియోజకవర్గానికి స్వాగతించడం నేను గౌరవంగా భావిస్తున్నాను. ఈ సంవత్సరం సదస్సు యొక్క ప్రధాన అంశం 'పరిపూర్ణ ప్రపంచ న్యాయం – శాశ్వత శాంతికి పునాది' ఇంతకంటే సమయోచితంగా ఉండలేను. ప్రపంచం గతంలో ఎన్నడూ లేనంతగా విభజన, అనిశ్చితి మరియు ఆందోళనలను ఎదుర్కొంటున్న ఈ సమయంలో, ఇలాంటి సమావేశాలు అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంటాయి. స్థానిక పార్లమెంట్ సభ్యుడిగా, అలాగే అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీకి సంబంధించిన ఆల్-పార్టీ పార్లమెంటరీ గ్రూప్ కార్యదర్శిగా, ముఖ్యంగా స్థానిక స్థాయిలో ఈ జమాఅత్ అందిస్తున్న విశిష్ట సేవలను ప్రత్యక్షంగా చూడగలిగాను. నన్ను ఎప్పుడూ ఆకట్టుకునే విషయం ఏమిటంటే, ఇక్కడ శాంతిని కేవలం ఒక సిద్ధాంతం లేదా నినాదంగా చూడరు; దాన్ని ఆచరణలో అమలు చేస్తారు. సేవా కార్యక్రమాలు, దాతృత్వం మరియు ప్రజలను పరస్పరం దగ్గర చేయడం ద్వారా ఈ జమాఅత్ శాంతిని చురుకుగా ప్రోత్సహిస్తోంది."

అంతేకాక, శాంతికి పునాది మనం ప్రతిరోజూ ఒకరితో ఒకరు ఎలా జీవిస్తున్నామన్న దానిలోనే ఉందని ఆయన అన్నారు. స్థానిక సమాజాల్లో శాంతిని నిలుపు కోలేకపోతే, ప్రపంచ శాంతి కోసం చేసే ప్రయత్నాలకు పెద్దగా అర్థం ఉండ దన్నారు. శాశ్వత శాంతి కేవలం కలిసి జీవించడం వల్ల కాదు; నిరంతర సంబంధాలు మరియు పరస్పర అవగాహన ద్వారా అది అభివృద్ధి చెందుతుందని వివరించారు. చివరగా ఆయన ఇలా అన్నారు: "ప్రత్యేకంగా హుజూర్ అన్వర్ గారిని గూర్చి ప్రస్తావించాలను కుంటున్నాను. శాంతి, న్యాయం మరియు పరస్పర గౌరవంపై వారి నిరంతర సందేశం ఈ సమాజాన్ని దాటి ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపుతోంది."

**సర్ ఎడ్ డవే ఎం.పి గౌ॥ రెట్.**

ఆయన ఇలా అన్నారు: "మరోసారి పీస్ సింపోజియంలో పాల్గొనడానికి ఆహ్వానించబడటం నేను ఎంతో గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇక్కడికి విచ్చేసిన అతిథులందరి తరఫున నేను కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. నా దేశంలో శాంతి సందేశాన్ని ఇంత నిరంతరంగా, స్థిరంగా ప్రచారం చేస్తూ, అన్ని మతాలవారినే కాకుండా ఏ మతానికీ చెందని వారిని కూడా ఒకే వేదికపైకి తీసుకువచ్చి పరస్పర సంభాషణకు అవకాశం కల్పించే మరే సంస్థ గురించి నాకు తెలియదు. సమాజాల మధ్యగానీ, దేశాల మధ్యగానీ శాంతి నెలకొల్పడానికి ఇటువంటి సంభాషణలు అత్యంత అవసరం. ప్రపంచ నాయకుడిగా హుజూర్ గారు శాంతి ప్రాముఖ్యతను అత్యంత బలంగా నొక్కి చెప్పే వ్యక్తుల్లో ఒకరు."

**సీమా మల్హోత్రా**

**ఫెల్తమ్ మరియు హెస్టన్ నియోజక వర్గాల ఎంపీ**

ఆమె ఇలా అన్నారు: "సంఘర్షణలను నివారించడం, మరింత అభివృద్ధి చెందిన మరియు శాంతియుత సమాజాన్ని నిర్మించడం గురించి మాట్లాడితే, సామాజిక సంస్థలు, మత సంస్థలు మరియు పౌర నాయకులు ప్రజల మధ్య, సమాజాల మధ్య పరస్పర అవగాహనను పెంపొందించడంలో మరియు వారిని దగ్గర చేయడంలో ఎంతో ముఖ్యమైన పాత్ర పోషిస్తారని మనం చూస్తున్నాం.

అందుకే అహ్మదీయ ముస్లిం జమాత్ చేస్తున్న సేవలను మరియు ఈ విషయంలో హుజూర్ గారి నాయకత్వాన్ని నేను అభినందిస్తున్నాను. గత అనేక సంవత్సరాలుగా నేను దీనిని దగ్గరి నుండి గమనిస్తున్నాను. శాంతి, న్యాయం మరియు మానవ గౌరవం కోసం మీ నిరంతర స్వరం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజల హృదయాలను తాకింది.

ఉక్రెయిన్ మరియు గాజాలో జరిగిన యుద్ధాల భయానక దృశ్యాలను మనం చూశాం. పెరుగుతున్న ఉద్రిక్తతలను చూశాం. ఇటీవల ఇరాన్‌కు సంబంధించిన సంఘర్షణలను కూడా చూశాం. యుద్ధం మన వారసుల యొక్క గుర్తింపుగా మారడానికి మనం అనుమతించలేము, అనుమతించకూడదు కూడా. దానికి బదులుగా మన వారసులు శాంతిప్రియులు కావాలి.

నన్ను ఈ కార్యక్రమానికి ఆహ్వానించినందుకు, మానవాళికి సేవ చేయడానికి మరియు శాశ్వత శాంతిని నెలకొల్పడానికి మీరు చేస్తున్న కృషికి మరోసారి ధన్యవాదాలు. ఈ పీస్ సింపోజియంలో మీతో కలిసి పాల్గొనడం నాకు గౌరవంగా ఉంది. ధన్యవాదాలు."

**పీస్ సింపోజియం మరియు హుజూర్ గారి ప్రసంగంపై అతిథుల అభిప్రాయాలు**

రఫీక్ అహ్మద్ హయాత్ జాతీయ అధ్యక్షుడు, అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ యూకే గారు కార్యక్రమం అనంతరం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఇలా అన్నారు:

ప్రస్తుతం ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో యుద్ధాలు మరియు రక్తపాతం కొనసాగుతున్నాయి. దీనివల్ల ప్రజలు తీవ్ర బాధలు మరియు ఆందోళనలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గాజా, లెబనాన్, సూడాన్ మరియు ఆఫ్ఘనిస్తాన్ వంటి ప్రాంతాల్లో పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయి. ఏళ్ల తరబడి కొనసాగుతున్న యుద్ధాలు ఎటువంటి నిజమైన ప్రయోజనాన్ని ఇవ్వలేదు. అవి కేవలం విధ్వంసం మరియు నష్టాన్ని మాత్రమే మిగిల్చాయి.

ప్రపంచ నాయకులు తమ అహంకారాన్ని పక్కనబెట్టి, హుజూర్ గారు అందిస్తున్న శాంతి మరియు మానవత్వ సందేశాన్ని పరిశీలిస్తే ప్రపంచంలో మరింత శాంతి నెలకొనగలదని ఆయన అన్నారు. కొంతమంది నాయకులు యుద్ధాలకు ఆర్థిక లేదా రాజకీయ మద్దతు ఇవ్వడంపైనే దృష్టి పెడుతున్నారని, కానీ యుద్ధాలను ముగించి శాశ్వత శాంతి కోసం ఆచరణాత్మక చర్యలు తీసుకోవడమేనని నేడు చాలా అవసరమని అమీర్ గారు పేర్కొన్నారు.

పీస్ సింపోజియం ప్రచారం గురించి మాట్లాడుతూ, నేటి సోషల్ మీడియా యుగంలో ఒక సందేశం ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మందికి చేరుతుందని అమీర్ గారు చెప్పారు.

యూకే పీస్ సింపోజియంలో ఖిలాఫత్ ప్రతినిధ్యం వహించడం చాలా ముఖ్యమని ఆయన తెలిపారు. అనేక దేశాల నుంచి అతిథులు, మంత్రులు హాజరవుతారని, వారు సానుకూల సందేశాన్ని తీసుకుని తమ దేశాలకు తిరిగి వెళ్తారని చెప్పారు. అలాగే పెద్ద దేశాలు శాంతి విషయంలో నాయకత్వం చూపాల్సిన అవసరం ఉందని, అవి ముందుకు రాకపోతే చిన్న దేశాలు కూడా వాటి అడుగు జాడల్లోనే నడుస్తాయని పేర్కొన్నారు.

**ఫరీద్ అహ్మద్**

**విదేశీ వ్యవహారాల కార్యదర్శి, అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ యూకే**

ఆయన ఇలా మాట్లాడినారు: గత ఇరవై సంవత్సరాల్లో నేషనల్ పీస్ సింపోజియంలో సభ్యుల సంఖ్య పెరుగడంతో పాటు తన ప్రభావం మరియు ప్రాముఖ్యత పరంగా కూడా ఈ కార్యక్రమము విస్తరిస్తుందని తెలిపారు. నేడు అనేక దేశాల నుంచి ప్రజలు హాజరవుతూ, హుజూర్ గారి శాంతి, మానవత్వం మరియు కరుణ సందేశం ద్వారా ప్రేరణ పొందుతున్నారు. ఎంటిఏ ఇంటర్నేషనల్ ద్వారా ఈ సందేశం ప్రపంచవ్యాప్తంగా చేరుతోందని, దాంతో ఈ పీస్ సింపోజియం అంతర్జాతీయ శాంతి ప్రోత్సాహానికి మరింత శక్తివంతమైన వేదికగా మారుతోందని ఆయన చెప్పారు. నేటి కాలంలో సంఘర్షణలు మరింత స్పష్టంగా కనిపిస్తున్నందున, హుజూర్ గారు గతంలో కంటే మరింత స్పష్టంగా మరియు నేరుగా శాంతి మరియు మానవత్వానికి మద్దతుగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు.

**క్లేర్ డెస్మండ్**

**క్రిస్టియన్ సాలిడారిటీ వరల్డ్‌వైడ్**

ఆమె ఇలా అన్నారు:

ఈ కార్యక్రమం వివిధ నేపథ్యాల ప్రజలను ఒకే లక్ష్యం కోసం కలిపే అద్భుతమైన అవకాశాన్ని కల్పించింది. హాజరైనవారు విభిన్న అభిప్రాయాలను వినగలిగారు. ముఖ్యంగా హుజూర్ గారి ప్రసంగం ద్వారా విలువైన మార్గదర్శకత్వాన్ని పొందగలిగారు. శాంతి కోసం కేవలం ప్రపంచ నాయకులపైనే ఆధారపడలేమని, ప్రతి వ్యక్తి తన సమాజంలో మరియు తన ప్రభావ పరిధిలో పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని ఆమె పేర్కొన్నారు. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో ఇటువంటి కార్యక్రమాలు ఆకాంక్ష, ప్రోత్సాహం మరియు ఐక్యతను పెంపొందిస్తాయని చెప్పారు. మొత్తానికి మీరు "ప్రయత్నాన్ని కొనసాగించండి --- అదే శాంతిని తీసుకువస్తుంది." అన్నారు.

**లిండా స్టీఫెన్స్**

**'వుమెన్స్ వెల్‌బీయింగ్' సంస్థ డైరెక్టర్**

మహిళల ఆరోగ్యం, ప్రీ విపోస్ట్,మెనోపాజ్ అదే విధముగా ప్రసవానికి ముందు మరియు తర్వాత సంరక్షణ, తల్లుల సంక్షేమం వంటి అంశాలపై పనిచేసే లిండా స్టీఫెన్స్, తాను ఈ కార్యక్రమానికి వాన్ జేమ్స్ ఫార్మసీకి చెందిన బుష్రా ఆహ్వానంతో వచ్చినట్లు తెలిపారు.ఇంతకు ముందు కూడా ఆమె ఈ పీస్ సింపోజియం లో పాల్గొన్నారు. ఈసారి అనుభవం ప్రత్యేకంగా అనిపించిందని, ఎందుకంటే ఇక్కడి శాంతి, ప్రేమ, మానవ అనుబంధాల వాతావరణాన్ని మరియు హుజూర్ గారి సందేశాన్ని ఎంతో శ్రద్ధతో ఆలకించానని, అనుభూతి చెందానని చెప్పారు. ప్రస్తుతం ప్రపంచం ఒక పెద్ద అంతర్జాతీయ సంఘర్షణ ప్రమాదాన్ని ఎదుర్కొంటోందని, అందువల్ల మానవత్వం, ఐక్యత మరియు శాంతి సందేశాలు గతంలో కంటే నేడు మరింత అవసరమని ఆమె పేర్కొన్నారు. అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీని ప్రశంసిస్తూ, అక్కడ ఉన్న ప్రతి వ్యక్తిలో ప్రేమ, కుటుంబ విలువలు, ఇతర మతాల పట్ల గౌరవం మరియు ప్రపంచ సోదరభావం ప్రతిఫలించాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం తాను ఒక శుభప్రదంగా భావించానని చెప్పారు.

వైట్ హిల్ మరియు బోర్డన్ ప్రాంత కౌన్సిలర్, అలాగే సామాజిక మరియు ప్రజా ప్రచార కార్యకర్త, అలెక్స్ పేజ్ నిర్వాహకురాలైన కేథరీన్ క్లార్క్, ఈ కార్యక్రమం యొక్క ప్రాముఖ్యత గురించి ఇలా మాట్లాడారు. (9 వ పేజీలో చదువుము)

# జుమా ప్రసంగము

**ముస్లింలు శాంతిగా జీవించాలని దజ్జాల్ శక్తులు ఎప్పుడూ కోరుకోవని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. వారి అసలు లక్ష్యం ముస్లిం ప్రపంచంలో నిరంతర విభేదాలు, అశాంతి సృష్టించడమే. దజ్జాల్ శక్తులు తరచుగా ప్రజలను మోసగిస్తూ, విస్తారమైన చమురు నిల్వలు మరియు ఇతర సహజ వనరులు కలిగిన అరబ్ దేశాలతో శాంతి స్థాపన కోసమే ఒప్పందాలు, కూటములు కుదుర్చుకుంటు న్నామని చెప్పాయి. అయితే వాస్తవానికి వారి రహస్య ప్రణాళికలు వేరుగా ఉండేవి, అవి ఇప్పుడు స్పష్టంగా బయటపడుతున్నాయి.**

---

**అందువల్ల, అరబ్ దేశాలు మరియు అదే విధంగా ఇరాన్ ప్రభుత్వం శాంతియుత పరిష్కారాన్ని కోరాలి. చైనా మరియు పాకిస్తాన్ సహా మరికొన్ని దేశాలు సయోధ్యను సులభతరం చేయడంలో తమ పాత్రను పోషించడానికి ముందుకు వచ్చాయి. ముస్లిం ప్రపంచం ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే ఎంతో మంచిది.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 06 మార్చి 2026 ( 06 అమాన్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهُ لَا شَرِيكَ لَهُ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهُ وَرَسُولُهُ

أَمَّا بَعْدُ فَأَعُوذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ- بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ. اَلرَّحْمٰنِ الرَّحِيْمِ. مٰلِكِ يَوْمِ الدِّيْنِ.

اِيَّاكَ نَعْبُدُ وَاِيَّاكَ نَسْتَعِيْنُ. اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ.

صِرَاطَ الَّذِيْنَ اَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ.

దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తీసుకు వచ్చిన ఈ సందేశం యొక్క ప్రధాన ఉద్దేశ్యం ఏకేశ్వరుడైన అల్లాహ్‌పై విశ్వాసాన్ని పెంపొందించడం, అతనిని మాత్రమే ఆరాధించడం, అతని ఏకత్వాన్ని స్థాపించడం, అందుకు అనుగుణముగా ప్రయత్నించడం, అతని దాసులకు చెందాల్సిన హక్కులను నెరవేర్చడం. అదే విధముగా ఒక ఏకీకృత ఉమ్మత్ (ముస్లిం సమాజం)ను నిర్మించడం మరియు పరస్పరం సోదరులుగా జీవించేలా చేయడం కూడా లక్ష్యమే. కాని నేడు, "లా ఇలాహ ఇల్లల్లాహు ముహమ్మదుర్రసూలుల్లాహ్" అనే కలిమాను పఠిస్తున్నామని చెప్పుకుంటున్నప్పటికీ, ముస్లిం ఉమ్మత్ విభజనలకు లోనై ఐక్యతను కోల్పోయింది. మన ఆచరణలు మనం అనుసరిస్తున్నామని చెప్పుకునే బోధనలను ప్రతిబింబింప చేయడం లేదు. అందుకే, నేటి ముస్లిం ప్రపంచ పరిస్థితిని చూసినచో చాలా ఆందోళన కరంగా ఉందని మనం అర్థం చేసుకోవచ్చును.

కొన్ని ముస్లిం దేశాలు సహజ వనరులు మరియు సంపదను కలిగి ఉన్నప్పటికీ, అగ్రరాజ్యాల దృష్టిలో ఆయా దేశాలకు ఎలాంటి ప్రాధాన్యత లేదు, అలాగే, ఆయా దేశాలు ఇస్లాం మత ప్రచారంలో గణనీయమైన పాత్ర పోషించడం లేదు. ఇస్లామీయ బోధనలను అనుసరించేందుకు చేయవలసినన్ని ప్రయత్నాలు కూడ ఆయా దేశాలు చేయడం లేదు. గతంలో నేను అనేకసార్లు చెప్పినట్లుగా, దీని ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ముస్లిమేతరులు ఈ పరిస్థితులను తమ ప్రయోజనాల కోసం వినియోగించుకుంటున్నారు.

అందువల్ల, ముస్లిం ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు మరియు రాజవంశీయులు తమ స్వప్రయోజనాలను సాధించుకోవడానికి మాత్రమే కృషి చేయకుండా, మనం ఒకే ఉమ్మత్(సమాజం)గా ఐక్యమవడానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలి. అలా చేసినప్పుడే ప్రపంచ శక్తుల దాడుల నుండి మనలను మనం రక్షించుకోగలుగుతాము. అప్పుడు మాత్రమే మన గౌరవాన్ని కాపాడుకో గలుగుతాము. అలాగే, ఇస్లాం వ్యతిరేక శక్తులు విభేదాలను సృష్టించకుండా అడ్డుకోగలుగుతాము.ఈ లక్ష్యాన్ని సాధించడానికి అల్లాహ్ సర్వశక్తిమంతుడు ఈ యుగంలో మన కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ గురించి కూడా మనం ఆలోచించాలి. ఈ పరిస్థితుల నుండి మనలను రక్షించి, ఒకే జాతిగా ఐక్యపరచగల ఆ దైవిక వ్యవస్థ ఏమిటి?. అని ఆలోచించాలి. నిజానికి అల్లాహ్ ఏర్పాటు చేసిన వ్యవస్థ ఏమిటంటే, ఒక ఐక్య ఉమ్మత్(సమాజం)ను నిర్మించేందుకు అల్లాహ్ హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ)ను పంపాడు.

కాబట్టి, మనం దీనిపై లోతుగా ఆలోచించాలి. ప్రపంచంలోని ముస్లిం దేశాలు మరియు ముస్లింలు ఈ విషయాన్ని గంభీరంగా పరిశీలించి, దానిపై దృష్టి పెట్టినప్పుడే, తమపై ప్రేరేపించబడుతున్న కలహాలు మరియు విభేదాల నుండి తమను తాము రక్షించుకోగలుగుతారు. అయినప్పటికీ, అహ్మదీయులుగా మనం కృషి చేయడంతో పాటు, అల్లాహ్ ముస్లిం ఉమ్మత్ (సమాజం)ను ఐక్యం చేసి, ప్రస్తుతం వారు ఎదుర్కొంటున్న దౌర్జన్యాలు మరియు అన్యాయాల నుండి వారిని రక్షించాలని ప్రార్థించాలి.

నేను చాలా కాలంగా ప్రపంచ పరిస్థితుల గురించి మాట్లాడుతున్నాను. గతంలో, ప్రస్తుత పరిస్థితికి ప్రధాన కారణం యూరప్ మరియు ఇతర పాశ్చాత్య దేశాలేనని భావించబడింది. నిజానికి అవి ముఖ్య కారణాల్లో ఒకటే. అయితే ముస్లిం దేశాలు కూడా ఈ పరిస్థితికి కొంతవరకు కారణమవుతున్నాయి. తమ లక్ష్యాలను సాధించేందుకు పాశ్చాత్య శక్తులు మొదట ముస్లిం దేశాలలో అశాంతిని సృష్టించాయి. తరువాత క్రమంగా ఆ అశాంతిని మరింత పెంచి, ఇతర దేశాలకు కూడా వ్యాపింపజేశాయి. వారి ఉద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ దేశాల వనరులను తమ ఆధీనంలోకి తెచ్చుకోవడానికి, తమ ప్రభావాన్ని ఉపయోగించి వాటిని నియంత్రించాలని వారు కోరుకుంటున్నారు. కొన్ని అరబ్ దేశాలు సంపన్నంగా ఉన్నప్పటికీ, నేను ఇప్పటికే చెప్పినట్లుగా, ఈ పాశ్చాత్య శక్తులు వాటిని తమ ప్రభావం మరియు నియంత్రణలోకి తెచ్చుకున్నాయి. ఏ పరిస్థితిలోనైనా, నేను చాలా కాలంగా బాహ్య ప్రపంచానికి మాత్రమే కాకుండా మన సొంత ప్రజలకూ చెబుతూ వచ్చిన ఆందోళనలు ఈరోజు స్పష్టంగా నిజమవుతున్నాయి.

ముస్లింలు శాంతిగా జీవించాలని దజ్జాల్ శక్తులు ఎప్పుడూ కోరుకోవని మనం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలి. వారి అసలు లక్ష్యం ముస్లిం ప్రపంచంలో నిరంతర విభేదాలు, అశాంతి సృష్టించడమే. దజ్జాల్ శక్తులు తరచుగా ప్రజలను మోసగిస్తూ, విస్తారమైన చమురు నిల్వలు మరియు ఇతర సహజ వనరులు కలిగిన అరబ్ దేశాలతో శాంతి స్థాపన కోసమే ఒప్పందాలు, కూటములు కుదుర్చుకుంటు న్నామని చెప్పాయి. అయితే వాస్తవానికి వారి రహస్య ప్రణాళికలు వేరుగా ఉండేవి, అవి ఇప్పుడు స్పష్టంగా బయటపడుతున్నాయి.

కాబట్టి ముఖ్యంగా ఈ రోజుల్లో, ముస్లిం ప్రపంచం కోసం ప్రత్యేకంగా ప్రార్థిస్తూ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముందు వినయంతో ప్రార్థన చేయడం మన కర్తవ్యం. ఎందుకంటే ఈ సమయంలో అలాంటి ప్రార్థనల అవసరం చాలా ఎక్కువగా ఉంది.

ప్రస్తుతం మధ్యప్రాచ్యంలో జరుగుతున్న యుద్ధాన్ని పరిశీలిస్తే ఒక విషయం స్పష్టంగా కనిపిస్తుంది. అమెరికా సంయుక్త రాష్ట్రాలు అనేక ముస్లిం దేశాల్లో ఎన్నో సైనిక స్థావరాలను ఏర్పాటు చేశాయి. అయితే అవి ఏ ఉద్దేశ్యంతో, ఎందుకు ఏర్పాటు చేయబడ్డాయి? నిజంగా ఆ దేశాల రక్షణ కోసమేనా? అరబ్ దేశాలకు అసలు ఎక్కడి నుంచి ముప్పు వాటిల్లనున్నది?.వాస్తవానికి, ఈ శక్తులే ముప్పులను సృష్టించి, తరువాత ఆ దేశాలు ప్రమాదంలో ఉన్నాయని, అందువల్ల వాటి రక్షణ కోసం సైనిక స్థావరాలు అవసరమని ఒక కథనాన్ని నిర్మించాయి. అయితే ఈ స్థావరాలు, ఆయుధాలు ముస్లింలు నిజంగా ఎదుర్కొనే ప్రమాదాలకు వ్యతిరేకంగా ఎప్పుడూ ఉపయోగించబడేవి కావు. బదులుగా, వారు తమ ప్రయోజనాలు మరియు వాణిజ్య సంబంధాలు మెరుగుపడతాయని హామీ ఇచ్చి, ముస్లింలను ఈ స్థావరాలను ఏర్పాటు చేయడానికి ఒప్పించారు. కానీ వాస్తవానికి ఈ ప్రాంతంలో తమ సొంత ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు బలమైన ఉనికిని ఏర్పరచు కోవడమే వారి ప్రధాన లక్ష్యం. అరబ్ దేశాలు ఏదైనా ముప్పును ఎదుర్కొన్నా, అది కూడా ప్రధానంగా ఈ శక్తులే సృష్టించిన ముప్పే. లేకపోతే ముస్లిం దేశాలకు సహజసిద్ధమైన ఎలాంటి ప్రమాదం ఉండేది కాదు. ఏదేమైనా, ఈ స్థావరాలు ఈ ప్రాంతంలో తమ ఆధిపత్యాన్ని కొనసాగించేందుకు ఏర్పాటు చేయబడ్డాయి. వారు కేవలం ఇస్లామేతర ప్రపంచంపైనే కాకుండా, ఇస్లామిక్ ప్రపంచంపైనా కూడ తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలని కోరుకుంటున్నారు. ఇరాన్ చాలా కాలంగా వారికి ఆందోళన, భయానికి కారణంగా ఉండేది. అలాగే సిద్ధాంతపరమైన భేదాల కారణంగా కొన్ని ముస్లిం దేశాలు కూడా ఇరాన్‌ను వ్యతిరేకించేవి. ఈ పరిస్థితిని ఇతర శక్తులు తమ ప్రయోజనాలకు అనుకూలంగా ఉపయోగించుకున్నాయి. ఇరాన్ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగా మరింత కఠినమైన విధానాన్ని అవలంబించినందున, ఇతర శక్తులు అరబ్ దేశాలను తమ నియంత్రణలో ఉంచి, అక్కడ సైనిక స్థావరాలను ఏర్పాటు చేయడం ద్వారా ఇజ్రాయెల్ రక్షణను నిర్ధారించడమే కాకుండా, తమ నిరంతర ఉనికితో ఇరాన్‌ను కూడా భయపెట్టడం సముచితమని భావించాయి. ఈ సైనిక స్థావరాల ఫలితంగా చివరికి ఏమి జరిగిందో ఇప్పుడు వాస్తవ పరిస్థితి చాలా స్పష్టంగా కనిపిస్తోంది. దాని పరిణామాలను మనం ప్రత్యక్షంగా చూశాము. అరబ్ దేశాలు సంభావ్య లక్ష్యాలుగా మారాయి మరియు వారి ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నాయి. చమురు సంపద కలిగిన దేశాలు లేదా పర్యాటక రంగంపై ఆధారపడిన దేశాలు ప్రతికూల ప్రభావానికి గురయ్యాయి. ఈ పరిస్థితి ఆయా శక్తివంతమైన దేశాలకు ప్రయోజనం చేకూర్చింది

మరియు భవిష్యత్తులో కూడా అలాగే కొనసాగుతుంది. యుద్ధం చెలరేగినప్పుడు, ఆర్థిక వ్యవస్థలు దెబ్బతిన్నప్పుడు, ప్రత్యర్థి పక్షం సహజంగానే ప్రతిస్పందిస్తూ మరో పక్షం యొక్క సైనిక స్థావరాలపై దాడి చేసి వాటిని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తుంది. ఇరాన్‌తో ఘర్షణ ఏర్పడినందున, ఇరాన్ కూడా మనం నేడు చూస్తున్న విధంగానే స్పందించింది. అది అరబ్ దేశాలలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకొని దాడులు జరిపింది. కొన్ని స్థావరాలను ధ్వంసం చేయగా, మరికొన్నింటికి నష్టం కలిగించింది. ఇటీవల ఒక అరబ్ జర్నలిస్టు, అరబ్ దేశాలు అప్రమత్తంగా మరియు జాగ్రత్తగా ఉండాలని రాశాడు. ఎందుకనగా, ఆయన అభిప్రాయం ప్రకారం, ఇరాన్‌కు ఆపాదించబడుతున్న దాడులన్నీ తప్పనిసరిగా ఇరాన్ ఒక్కటే చేసి ఉండకపోవచ్చు. అమెరికా మరియు ఇజ్రాయెల్ కూడా వాటిలో పాత్ర పోషించి ఉండవచ్చు. ఇరాన్ ప్రారంభ దాడులు చేసి ఉండవచ్చుననుకుందాం, అయినప్పటికీ ఈ శక్తులు ఇప్పుడు ఆ పరిస్థితిని ఉపయోగించుకొని తమ స్వంత దాడులను కూడా ప్రారంభించే అవకాశం ఉంది. కొన్ని సంఘటనల విషయంలో ఇరాన్ తన బాధ్యతను కూడా ఖండించింది. అంతేకాకుండా, ఏదో ఒక దశలో అమెరికా మరియు ఇజ్రాయెల్ ఈ యుద్ధం నుంచి తప్పుకొని వెళ్లిపోవచ్చు. అప్పుడు ముస్లిం ప్రపంచం తమలో తామే పోరాడుకుంటూ మిగిలిపోతుంది. ఇదే వారి లక్ష్యమని ఆ జర్నలిస్టు పేర్కొన్నాడు.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహ్(రాబేహ్ (నాలుగవ ఖలీఫా) రహ్మ గారు కూడా ఇరాక్ యుద్ధ సమయంలో ఇదే హెచ్చరిక చేశారు. "ఈ అశాంతి ప్రపంచ మంతటా వ్యాపిస్తూనే ఉంటుంది" అని వారు రహ్మ చెప్పారు.

(గల్ఫ్ దేశాల యుద్ధాలు పేజి 29,76)

ముస్లిం ప్రపంచం దీనిని అర్థం చేసుకుని ఉంటే ఎంత బాగుండేది!

ఇప్పుడు గమనించండి, ఇరాక్ యుద్ధంతో పాటు ఇతర ముస్లిం దేశాలకు కూడా ఈ ఘర్షణను విస్తరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. ఆ దేశాలలో అంతర్గత విభేదాలు మరియు కలహాలు సృష్టించబడ్డాయి. అప్పటి నుంచి ఇతర ముస్లిం దేశాలలో కూడా నిరంతర అశాంతి కొనసాగుతోంది. దీనిని ఎవరూ ఖండించలేరు. నేడు మనం చూస్తున్నట్లుగా, కొన్ని ముస్లిం దేశాలు ఒకదానితో ఒకటి యుద్ధం కూడా చేస్తున్నాయి. నేను చెప్పినట్లుగా, ఈ అశాంతిని పాశ్చాత్య శక్తులు వ్యాప్తి చేశాయి. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క ప్రత్యేక ఆజ్ఞ ప్రత్యక్షమయ్యే వరకు దీనికి ముగింపు కనిపించడం లేదు. అయితే ఆ పరిస్థితి ఏర్పడాలంటే కూడా ప్రజలు తమ వంతు ప్రయత్నాలు చేయవలసి ఉంటుంది. ఏదేమైనా, అల్లాహ్ ముస్లిం ప్రపంచాన్ని ఈ అశాంతి మరియు కల్లోలాల నుంచి రక్షించాలని, ముస్లింలు శాంతి కోసం కృషి చేసి పరస్పరం సోదరభావంతో జీవించాలని మనం ప్రార్థించాలి. ఇదే ఇస్లాం బోధన. అంతేగాని ఒకరి రక్తాన్ని మరొకరు చిందించుకోవడం కాదు.

ఈ నేపథ్యంలో, ఇది మన బాధ్యత. చాలా కాలంగా మనము మా ప్రజలకు మాత్రమే కాకుండా ఇతరులకు కూడా అన్యాయానికి దూరంగా ఉండాలని గుర్తుచేస్తూ వస్తున్నాము. అయితే అన్యాయం మరియు అణచివేత రోజురోజుకీ పెరుగుతున్నందున, ఇది విస్తృత స్థాయిలో ఒక ప్రపంచ యుద్ధానికి దారితీయవచ్చని సూచిస్తోంది. వాస్తవానికి, కొందరు పాశ్చాత్య వ్యాఖ్యాతల అభిప్రాయం ప్రకారం ప్రపంచ యుద్ధం ఇప్పటికే ప్రారంభమైంది. నేనూ అది ప్రారంభమైందని నమ్ముతున్నాను. అయినప్పటికీ, ఇప్పటికైనా ముస్లిం ప్రపంచం వివేకంతో వ్యవహరించి, పరిస్థితిని సరిగా అర్థం చేసుకొని, ఐక్యంగా కలిసి పనిచేస్తే, దజ్జాల్ సృష్టించే అల్లర్ల నుండి తనను తాను రక్షించుకోగలదు.

ప్రపంచ పరిస్థితులను పరిశీలిస్తే, ప్రపంచం తీవ్రమైన ప్రమాదంలో ఉందని స్పష్టమవుతుంది. నేను ఇంతకుముందు చెప్పినట్లుగా, ప్రతి ఒక్కరూ తమ స్వప్రయోజనాల కోసం మాత్రమే ప్రయత్నిస్తున్నారు. స్వార్థం పరాకాష్టకు చేరుకున్నప్పుడు, వ్యక్తి తన గురించి తప్ప మరెవరి గురించి ఆలోచించడు.

కావున, ప్రపంచంలో ఉన్న అశాంతి మరియు ఘర్షణలను తగ్గించాలంటే మనం మన హక్కులను సాధించడంతో సాధ్యమం కాదని, ఇతరుల హక్కులను కూడా గౌరవించి, వారికి వాటిని కల్పించాలి అనే విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. . ముస్లిం ప్రపంచం ఈ విషయాన్ని గ్రహించి, పాశ్చాత్య దేశాలు మరియు ఇతర ప్రధాన శక్తులలో సానుభూతి గల వర్గాలకు శాంతి స్థాపన కోసం వారు కూడా కొన్ని హక్కులను వదులుకోవాల్సి ఉంటుంది అని విడమర్చి చెప్పవలసి ఉంటుంది. వాస్తవానికి వారు ఇతరుల హక్కులను ఆక్రమిస్తున్నారు. కాబట్టి, వారు న్యాయంగా మరియు సమానత్వంతో వ్యవహరించాల్సిన అవసరం ఉందని, అప్పుడు మాత్రమే ప్రపంచంలో శాంతి నెలకొనగలదని మనం వారికి వివరించాలి. నేను ముందుగా చెప్పినట్లుగా, కొంతకాలంగా ఈ విషయంపై అందరికి శ్రద్ధ కల్పించడం జరుగుతుంది. నా మాటలు విని, "ప్రపంచం ఒక భయంకరమైన యుద్ధంలోకి జారిపోతుంది" అని నేను చెప్పినప్పుడు, నన్ను అతిగా నిరాశావాదిగా, ప్రతికూల దృక్పథం కలవాడిగా విమర్శించిన వారే ఇప్పుడు కొన్ని సంవత్సరాల క్రితం అసాధ్యమని భావించిన విషయాలు వాస్తవంగా మారిపోయాయని, యుద్ధాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని చెబుతున్నారు.

అమెరికా మరియు యూరప్‌లోని వారి స్వంత విశ్లేషకులు కూడా నేడు ప్రపంచ యుద్ధానికి నాంది పడిందని, నేను ఇంతకుముందు చెప్పినట్లుగా అది మరింత తీవ్రరూపం దాల్చుతుందని రాస్తున్నారు. ఈ శక్తులు తమ అక్రమ స్వప్రయో జనాలను కొనసాగిస్తున్నంతకాలం, ఈ ప్రమాదం తగ్గే అవకాశం కనిపించదు. యుద్ధం జరిగినప్పుడు ఇరు పక్షాలకూ నష్టాలు సంభవిస్తాయి. ప్రస్తుత మధ్యప్రాచ్య యుద్ధం అమెరికా ఇరాన్‌పై దాడి చేయడంతో ప్రారంభమైందని చెబుతున్నారు. అయితే తమపై దాడి జరిగితే, అరబ్ దేశాల్లో ఉన్న అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ స్పష్టంగా హెచ్చరించింది. ఆ స్థావరాలు ఒక నిర్దిష్ట ఉద్దేశ్యంతో ఏర్పాటు చేయబడ్డాయి. నేడు అవి ఎలా ఉపయోగించ బడుతున్నాయో మనం చూస్తున్నాము. యుద్ధం ప్రారంభమైన తర్వాత, ఇరాన్‌పై బాంబు దాడులు జరిగాయి, దాని నగరాలు ధ్వంసమయ్యాయి, పిల్లలతో సహా అనేక మంది నిరపరాధులు మరణించారు. వారి ఆధ్యాత్మిక నాయకుడి నివాసంపై కూడా దాడి జరిగింది. ఆయన కుటుంబ సభ్యుల్లో పలువురు మరణించారు. ఈ శక్తులు ఈ పాలనను అంతం చేస్తామని, తద్వారా ఇరాన్ ప్రజలకు స్వేచ్ఛ లభిస్తుందని ప్రకటించాయి. కానీ వాస్తవంగా దాని ఫలితం ఏలా వెలువడింది?.ఇంతకు ముందు కొద్ది మంది వరకు వారికి వ్యతిరేకంగా ఉండేవారు. కాని నేడు వారు కూడ వారికి మద్దతు ఇవ్వడం ప్రారంభించారు. వారి నాయకుడు ఖమేనీని ఒక అమరవీరుడిగా భావిస్తున్నారు. ఈ అమరవీరుడి భావన కారణంగా దేశంలో ఆయన స్థానం అత్యధికముగా పెరిగింది.

ఆయన పిల్లలు కూడా మరణించారు, అలాగే ఆయన కుటుంబంలోని అనేక మంది సభ్యులు కూడా ప్రాణాలు కోల్పోయారు. ఈ అన్యాయ చర్య ఫలితంగా పాలనా మార్పు జరగడానికి బదులుగా, తన ప్రజల మధ్య ఆయనకు ఉన్న గౌరవం మరియు మర్యాద మరింత పెరిగింది. ఏమైనప్పటికీ, ఇరాన్ పాశ్చాత్య శక్తులు మరియు అమెరికాకు చెందిన అరబ్ దేశాల్లోని సైనిక స్థావరాలపై దాడి చేయడం ద్వారా ప్రతిస్పందించింది. దీనికి అదనంగా, ఇరాన్ సౌదీ అరేబియాలోని చమురు బావులపై దాడి చేసిందని, ఇతర ప్రాంతాలపై కూడా దాడులు చేసి బెదిరింపులు జారీ చేసిందని అమెరికా హెచ్చరించింది. అందువల్ల తాము ప్రతీకార చర్యలు తీసుకుంటామని ప్రకటించింది. కొన్ని సందర్భాల్లో అయితే దాడి ఇప్పటికే జరిగిందని, కాబట్టి తాము తగిన విధంగా ప్రతిదాడి చేస్తామని కూడా పేర్కొంది. దీనికి స్పందిస్తూ, ఇరాన్ తాము అలాంటి ప్రదేశాలపై దాడి చేయలేదని, అలాంటి ఉద్దేశం కూడా లేదని స్పష్టంగా తెలిపింది. ఇది ముస్లింల హృదయాల్లో ఇతర ముస్లింలపై ద్వేషాన్ని రగిలించేందుకు రూపొందించిన మరో కుట్రలా కనిపిస్తోంది. యుద్ధం ఇప్పటికే ప్రారంభమైంది. ఇది కేవలం ఆ శత్రుత్వాన్ని మరింత రెచ్చగొట్టే ప్రయత్నం మాత్రమే. ఇంతకుముందు నేను ఒక పాత్రికేయుడి అభిప్రాయాన్ని ప్రస్తావించాను. అతను, వారు తామే నష్టం కలిగించుకొని, దానికి ఇరాన్‌ను బాధ్యురాలిగా చూపించే అవకాశమూ ఉందని సూచించాడు. ఇలాంటి పరిస్థితుల్లో ముస్లిం ప్రపంచం అత్యంత జాగ్రత్తగా, అప్రమత్తంగా వ్యవహరించాలి. అయితే మనము అహ్మదీయులం తీవ్రమైన వేదనను అనుభవిస్తున్నప్పటికీ, అసహాయులమై ఉన్నాము. వారిని హెచ్చరించడం, వారి కోసం ప్రార్థించడం జరుగుతున్నది. అదే విధముగా తప్పు అని వారికి అర్థమయ్యేలా ప్రయత్నించడం తప్ప మనము ఇంకేమీ చేయలేము. ముస్లిం దేశాల ప్రభుత్వాలు తమ స్వార్థపూరిత జాతీయ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి పెట్టకుండా, మొత్తం ముస్లిం ఉమ్మా (సమాజం) ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకొని, ఎలాంటి ద్రోహం లేదా విశ్వాస ఘాతుకానికి పాల్పడకుండా ఉంటే, ఇప్పటికైన కొంతవరకైన నష్టాన్ని నివారించే అవకాశం ఉంది.

మధ్యప్రాచ్యంలోని కొన్ని అరబ్ దేశాలకు అపారమైన చమురు సంపద ఉన్నప్పటికీ, వాటికి బలమైన రక్షణ సామర్థ్యాలు లేవు. అలాగే వాటి పరిశ్రమలు కూడా తగినంతగా అభివృద్ధి చెందలేదు. కేవలం చమురు సంపదతోనే లేదా కొన్ని ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా మాత్రమే నిజమైన పురోగతి సాధించలేము. అవి పూర్తిగా పాశ్చాత్య ప్రపంచం మరియు పాశ్చాత్య శక్తులపై ఆధారపడి ఉన్నాయి. నేను ముందే చెప్పినట్లుగా, పాశ్చాత్య శక్తులు ఈ బలహీనతను ఉపయోగించుకొని అక్కడ తమ సైనిక స్థావరాలను ఏర్పాటు చేసుకున్నాయి. తరువాత ఇరాన్‌పై యుద్ధం ప్రారంభమైనప్పుడు, ఇరాన్ కూడా అరబ్ దేశాల వైపు దాడులు చేయడం ప్రారంభించింది. కానీ వాస్తవానికి ఇరాన్ అరబ్ దేశాలపై నేరుగా దాడి చేయలేదు. అక్కడ ఉన్న అమెరికన్ సైనిక స్థావరాలనే లక్ష్యంగా చేసుకుంది. అయితే ఇప్పుడు ఆ దాడులు తమపైనే జరుగుతున్నాయని అరబ్ దేశాలకు భావన కలిగిస్తున్నారు. ఇప్పుడు ఈ యుద్ధం భయానకమైన స్థాయికి చేరుకుందని స్పష్టంగా కనిపిస్తోంది. ఇరాన్ నుండి క్షిపణులు ప్రయోగించ బడుతున్నాయి. వాటిని అడ్డుకోవడానికి అమెరికా రక్షణ వ్యవస్థలను ఏర్పాటు చేసింది. అయితే విశ్లేషకులు ఇప్పుడు ఇలా రాస్తున్నారు: ఇరాన్ 10,000 డాలర్ల ఖర్చుతో ఒక క్షిపణిని ప్రయోగిస్తే, దానిని అడ్డుకొని ధ్వంసం చేయడానికి ఉపయోగించే ప్రతిఘాత క్షిపణి ఖర్చు అనేక మిలియన్ డాలర్లకు చేరుకుంటుంది. కొంతమంది విశ్లేషకులు ఇది అమెరికా సంయుక్త రాష్ట్రాలకు ఆర్థికపరంగా కూడా భారీ ఖర్చును కలిగిస్తుందని అంటున్నారు. అయితే, ఇది కేవలం ఒక అభిప్రాయం మాత్రమే. ఇలాంటి శక్తివంతమైన దేశాలు ప్రతి విషయాన్ని ముందుగానే జాగ్రత్తగా లెక్కించి,

సమగ్రంగా అంచనా వేస్తాయి. ఈ పరిణామాలన్నింటికీ వారు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించి ఉంటారు. ఇలాంటి శక్తులు స్వచ్ఛందంగా ఈ నష్టాలను భరిస్తాయని నేను నమ్మను. బదులుగా, తాము అరబ్ దేశాలను రక్షిస్తున్నామని చెప్పి, ఆ ఖర్చును వారినుంచే తిరిగి వసూలు చేస్తాయి. ఒకవైపు వారి చమురు క్షేత్రాలు మూతపడుతున్నాయి, ద్రవ్యోల్బణం పెరుగుతోంది, చమురు ఉత్పత్తి తగ్గుతోంది; మరోవైపు, ఈ రక్షణ చర్యల ఖర్చులను కూడా వారు భరించాల్సి వస్తుంది. ఫలితంగా, వారి నిల్వలు గణనీయంగా తగ్గిపోతాయి. అంతేకాక పూర్తిగా ఖాళీ అయ్యే ప్రమాదం కూడా ఉంది. చివరికి, అరబ్ దేశాల ఆర్థిక వ్యవస్థలు తీవ్రమైన నష్టాన్ని ఎదుర్కొంటాయి. పాశ్చాత్య ప్రపంచం మరియు అగ్రరాజ్యాలు కూడా కొంత నష్టాన్ని అనుభవించవచ్చు. అయినప్పటికీ, అత్యధిక నష్టం అరబ్ దేశాలపైనే పడుతుంది. వారు ఇకనైన ఈ విషయాన్ని గ్రహించాలి.

ప్రస్తుతం అమెరికా అధ్యక్షుడు అమలు చేస్తున్న విధానాలు, గత ప్రభుత్వాలు అనుసరించిన విధానాలకే కొనసాగింపుగానే మనకు చూస్తున్నాము. ఇది ప్రస్తుత ప్రభుత్వానికి మాత్రమే చెందిన విధానం కాదు. చాలా కాలంగా వారు ఎక్కడ తమకు అవసరమైతే అక్కడ బలవంతంగా వనరులను స్వాధీనం చేసుకుని, అనంతరం వివిధ కారణాలు చూపుతూ తమ చర్యలను సమర్థించుకోవడం వారి విధానంగా మారింది. వాస్తవానికి, అమెరికా ప్రస్తుత ఉపాధ్యక్షుడు కూడా ఏ దేశమైన తమతో కలవకపోతే, దాని వనరులను బలవంతంగా స్వాధీనం చేసుకుని, తమతో కలిసేలా చేస్తామని చెప్పేంతవరకు వెళ్లారు. యుద్ధాలలో పాల్గొనడానికి నిరాకరించే దేశాలపై ఆంక్షలు, పరిమితులు విధించ బడుతున్నాయి. ఇటీవల స్పెయిన్ ప్రధానమంత్రి ధైర్యంగా తన దేశం యుద్ధంలో పాల్గొనదని, తమ సైనిక స్థావరాలను కూడా ఉపయోగించనివ్వనని ప్రకటించారు. దానికి ప్రతిస్పందనగా అమెరికా, స్పెయిన్‌తో వాణిజ్య సంబంధాలను తెంచేస్తామని బెదిరించింది. ఈ విధంగా భయపెట్టడం, అన్యాయ నష్టాల బెదిరింపులు చేయడం ద్వారా దేశాలను తమతో కలిసేలా ఒత్తిడి చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో న్యాయం కనుమరుగవుతుంది. న్యాయం లేకపోతే విధ్వంసం అని వార్యమవుతుంది. ప్రమాదకరమైన పరిణామాలు ఉద్భవిస్తాయి. ప్రస్తుతం మనం చూస్తున్న పరిణామాలే అవే. అంతేకాక, భవిష్యత్తులో మరింత తీవ్రమైన మరియు భయానకమైన పరిణామాలు కూడా సంభవించవచ్చు.

ఇటీవల యూరోపియన్ పార్లమెంట్‌లో ఒక స్పానిష్ మహిళా సభ్యురాలు చాలా స్పష్టంగా మాట్లాడారు. మహిళల దృష్టికోణం నుండి చూస్తే, అమెరికా చేసిన ఏ యుద్ధం ద్వారా కూడా మహిళలకు స్వేచ్ఛ లభించలేదని ఆమె పేర్కొన్నారు. అమెరికా ఇరానీ మహిళల స్వేచ్ఛ కోసం పోరాడుతోందన్న వాదన పూర్తిగా అసత్యమని ఆమె అన్నారు. ఇలాంటి చర్యల ద్వారా ఇరానీ మహిళలకు ఎప్పటికీ స్వేచ్ఛ లభించదని, అలాగే మహిళలకు స్వేచ్ఛను అందించిన విజయవంతమైన యుద్ధాన్ని అమెరికా ఎప్పుడూ నిర్వహించలేదని ఆమె పేర్కొన్నారు. సంక్షిప్తంగా చెప్పాలంటే, అమెరికా ఇప్పటికే ఈ దేశాలపై గణనీయమైన ప్రభావాన్ని కలిగి ఉన్నప్పటికీ, ఇప్పుడు ఆ ప్రభావాన్ని మరింత బలోపేతం చేయడానికి ఇజ్రాయెల్‌ను కూడా బహిరంగంగా ఈ వ్యవస్థలో భాగం చేస్తున్నారు.

అరబ్ మరియు ఇస్లామిక్ దేశాలు ఒక విషయం గ్రహించడంలో విఫలమవుతున్నాయి. బలవంతం, భయపెట్టడం, అన్యాయ పద్ధతులు మరియు మోసపూరిత వ్యూహాల ద్వారా వారిని తమ సొంత ముస్లిం దేశాల్లో ఒక దేశంతో మరొక దేశాన్ని యుద్ధంలోకి నెట్టివేస్తున్నారు. ముస్లింలను ముస్లింలతోనే పోరాడేలా చేస్తున్నారు.

ఇదే సమయంలో, రష్యా మరియు చైనా కూడా తమ సొంత కూటమిని ఏర్పరుస్తున్నాయి. ఏర్పడుతున్న ఈ కూటములు భవిష్యత్తులో మరింత విస్తరించి, బలపడతాయని స్పష్టంగా కనిపిస్తోంది. ఇస్లామిక్ ప్రపంచం యుద్ధాలకు యుద్ధ భూమిగా కొనసాగుతూనే ఉంటుంది, ఎందుకంటే ఈ శక్తివంతమైన దేశాలు నియంత్రించాలనుకునే సహజ వనరులు అక్కడ ఉన్నాయి. ముస్లింలు దీనిని గుర్తించి వివేకంతో వ్యవహరిస్తే ఎంతో మంచిది!.

ప్రస్తుతం, అమెరికా మరియు దాని మిత్రదేశాలు ఇరాన్‌పై దాడి చేసిన కారణంగా, ఇరాన్‌కు ఉన్న ఉద్దేశ్యాలనే చూపిస్తున్నాయి. ఆ ఉద్దేశ్యాలు కార్యరూపం దాల్చి ఉంటే, అణుబాంబు అభివృద్ధి వంటి పరిణామాలు సంభవించేవని వారు అంటున్నారు. మరో మాటలో చెప్పాలంటే, కేవలం ఒక ఊహాత్మక పరిస్థితిని సృష్టించి, అలాంటి సంఘటన జరిగి ఉంటే కొన్ని ఫలితాలు వచ్చేవని భావించి, దాని ఆధారంగా యుద్ధాన్ని ప్రారంభించారు. ఇది స్పష్టమైన దురాక్రమణ చర్య. నేడు పాశ్చాత్య విశ్లేషకులు కూడా ఇరాన్‌ను నాశనం చేయడం లేదా దానిపై యుద్ధం చేయడం తాము ఊహించినంత సులభం కాదని అంగీకరించడం ప్రారంభించారు. ఇరాన్ ఒక విస్తారమైన దేశం, దానికి తగిన శక్తి ఉంది. ఈ యుద్ధం దీర్ఘకాలం కొనసాగవచ్చు. దీని ప్రభావం ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై పడినప్పటికీ, ముస్లిం ప్రపంచంపై దాని ప్రభావం మరింత తీవ్రంగా ఉంటుంది. అయితే, ఇందులో అత్యంత విషాదకరమైన విషయం ఏమిటంటే, ముస్లింలే ముస్లింల రక్తాన్ని చిందిస్తున్నారు. అందువల్ల ముస్లింలు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ శిక్షకు భయపడాలి. వందలాది మంది పిల్లలు మరణించారు, అలాగే వందలాది మంది నిరపరాధులు తమ ప్రాణాలు కోల్పోయారు. ఇప్పుడు పాశ్చాత్య విశ్లేషకులు ఇలా వ్యాఖ్యానిస్తున్నారు: ఇజ్రాయెల్, అమెరికా లేదా ఏదైనా పాశ్చాత్య దేశంలో దాడి జరిగి, కొద్దిమంది పిల్లలు మరణిస్తే, పత్రికలు రోజుల తరబడి దాని గురించి వరుస కథనాలు ప్రచురించేవి. కానీ ఇక్కడ ఒక పాఠశాలపై బాంబుదాడి జరిగి, వందలాది మంది పిల్లలు మరణించినా కూడా, దాని గురించి ఎవరూ మాట్లాడటం లేదు. మొదట పాలస్తీనాను ఈ పరిస్థితికి గురిచేశారు, ఇప్పుడు అదే పరిస్థితి ఇరాన్‌లో కూడా జరుగుతోంది. వారి దృష్టిలో ఒక ముస్లింకి ఉన్న ప్రాణం పెద్దగా విలువ లేనిదిగా కనిపిస్తోంది.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ముస్లింలకు జ్ఞానం, వివేకం ప్రసాదించుగాకా!. వారు పరస్పర అవగాహనతో వ్యవహరించి, చర్చలు మరియు పరస్పర సంప్రదింపుల ద్వారా తమ విభేదాలను పరిష్కరించడానికి ప్రయత్నించుగాకా! వారు దేవుని ఏకత్వాన్ని విశ్వసిస్తున్నామని చెప్పినప్పుడు, ఆ ఏకత్వ స్థాపన కోసం ఏకమవ్వాలి. నిరాధార ఆరోపణల ద్వారా విభేదాలు సృష్టించడం అవసరం లేదు. అలాగే, వివాదాలు కేవలం ఒక ప్రత్యేక వర్గం విశ్వాసాల కారణంగానే ఉత్పన్నమవుతున్నాయని చెప్పడం కూడా సరికాదు. ముస్లింల మధ్య సిద్ధాంతపరమైన భేదాలు ఉన్నాయనేది నిజమే, అవి కొన్నిసార్లు వివాదాలకు దారితీయవచ్చు. అయితే, దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇటువంటి విషయాలలో అత్యంత జాగ్రత్తగా మరియు కరుణతో వ్యవహరించేవారు. ఒక సందర్భంలో, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క కొందరు సహచరులు ఒక వ్యక్తిని కపటవిశ్వాసి (మునాఫిఖ్) అని పేర్కొన్నారు. అప్పుడు ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సమాధానమిచ్చారు: అతను “లాఇలాహ ఇల్లల్లాహ్” (అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడు ఎవరూ లేరు) అని ప్రకటిస్తున్నంత కాలం, అతనికి వ్యతిరేకంగా తాను ఏమీ చెప్పబోనని, అలాగే వారు కూడా అతనిని కపటవిశ్వాసి అని పిలవడం మానుకోవాలని సూచించారు.

**(సహి బుఖారి కితాబుస్సలాత్, బాబుల్ మసాజిద్, ఫిల్ బుయూతి, హదీస్ 425)**

అందువల్ల, చిన్నచిన్న విషయాలపై వివాదాలు సృష్టించడం చివరికి మనకే నష్టాన్ని కలిగిస్తుంది. ఈ వాస్తవాన్ని ముస్లిం ప్రపంచం గ్రహించే అవగాహనను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రసాదించుగాకా!. ఇప్పటికైనా వారు వివేకంతో వ్యవహరించి, కేవలం సిద్ధాంతపరమైన భేదాల కారణంగా ఇరాన్‌కు వ్యతిరేకంగా మారకూడదు.

ఇస్లాం తౌహీద్ (దేవుని ఏకత్వం) స్థాపన కోసం వచ్చింది. కాబట్టి ఆ లక్ష్య సాధనకే ప్రయత్నాలు కేంద్రీకృతం కావాలి. ప్రపంచంలోని అగ్రరాజ్యాధి నేతలను తమ దేవుళ్లుగా భావించకూడదు. ఎందుకంటే శాశ్వతంగా నిలిచే శక్తి ఒక్క అల్లాహ్‌దే. ఈ అగ్రరాజ్యాధి నేతలను పరమాధికారులుగా పరిగణిస్తే, వారు క్రమంగా ఒక దేశం తర్వాత మరొక దేశాన్ని తమ ఆధీనంలోకి తీసుకుంటూ మొత్తం ఇస్లామీయ ప్రపంచంపై నియంత్రణ సాధిస్తారు. చివరికి ముస్లింల నామమాత్రపు అధికారం, పాలన కూడా అంతరించిపోతాయి. ఇప్పటికీ సమయం ఉంది. వివేకంతో వ్యవహరించి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వైపు తిరగడం అత్యవసరం.

ఈ ప్రాపంచిక శక్తులు ప్రపంచ శాంతి, ప్రశాంతతలను, ముఖ్యంగా ముస్లిం ప్రపంచంలోని శాంతిని నాశనం చేశాయి. భవిష్యత్తులో కూడా అవి అదే విధంగా కొనసాగిస్తాయి. ముస్లింలకు మార్గదర్శనం చేస్తూ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇలా పేర్కొన్నాడు:

وَإِن طَائِفَتَانِ مِنَ الْمُؤْمِنِينَ اقْتَتَلُوا فَأَصْلِحُوا بَيْنَهُمَا ۖ فَإِن بَغَتْ إِحْدَاهُمَا عَلَى الْأُخْرَىٰ فَقَاتِلُوا الَّتِي
تَبْغِي حَتَّىٰ تَفِيءَ إِلَىٰ أَمْرِ اللَّهِ ۚ فَإِن فَاءَتْ فَأَصْلِحُوا بَيْنَهُمَا بِالْعَدْلِ وَأَقْسِطُوا ۖ إِنَّ اللَّهَ يُحِبُّ الْمُقْسِطِينَ-

అనగా: “విశ్వాసులలోని రెండు వర్గాలు పరస్పరం యుద్ధం చేసుకుంటే, వారి మధ్య సంధి చేయండి. అయితే వారిలో ఒక వర్గం మరొక వర్గంపై దురాక్రమణకు పాల్పడితే, అల్లాహ్ ఆదేశం వైపు తిరిగి వచ్చే వరకు ఆ దురాక్రమణ చేసే వర్గంతో పోరాడండి. ఆ తర్వాత వారు తిరిగి వస్తే, వారి మధ్య న్యాయంగా సంధి చేయండి మరియు సమానత్వంతో వ్యవహరించండి. నిశ్చయంగా అల్లాహ్ న్యాయంగా వ్యవహరించే వారిని ప్రేమిస్తాడు.” (అల్-హుజురాత్ :10)

ఈ సూత్రం ప్రపంచంలో శాంతి స్థాపనకు ఒక ప్రాథమిక మార్గరేఖను అందిస్తుంది. కావున ముఖ్యంగా ముస్లిం ప్రపంచం ఈ మార్గదర్శ కత్వాన్ని తప్పకుండా అనుసరించాలి. ఎందుకంటే సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌యే ఈ స్పష్టమైన మార్గదర్శకత్వాన్ని పవిత్ర ఖుర్‌ఆన్‌లో ఇచ్చాడు.

కాబట్టి న్యాయం, సమానత్వం అనే అవసరాలను తప్పనిసరిగా నెరవేర్చాలి. ఇస్లామీయ దేశాల ప్రభుత్వాలు కూడా ఈ విషయంలో తమ బాధ్యతను నిర్వర్తించాలి.

అలాగే, సయోధ్యకు ప్రయత్నిస్తున్నప్పుడు వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వకూడదని స్పష్టంగా గుర్తుంచుకోవాలి. బదులుగా, సమస్య యొక్క అసలు మూల కారణాలను ఆధారంగా చేసుకొని నిర్ణయం తీసుకోవాలి. ఆ కారణాలు స్పష్టంగానే కనిపిస్తున్నాయి: దజ్జాల్ శక్తులు, అలాగే స్థాపించబడిన వివిధ సంస్థలు ముస్లింలను ఒకరిపై మరొకరితో యుద్ధం చేయించాలని ప్రయత్నిస్తున్నాయి. ఐక్యరాజ్యసమితి కూడా సానుకూల పాత్ర పోషించడంలో విఫలమయ్యింది. అందువల్ల కొందరు దానిని బహిరంగంగా విమర్శించడం ప్రారంభించారు. మనం వ్యక్తిగత,

జాతీయ ప్రయోజనాలకు అతీతంగా ఎదిగితేనే మనల్ని మనం రక్షించుకో గలుగుతాము. లేనిపక్షంలో, ఈ దజ్జాల్ శక్తుల బారిన పడతాము. అందువల్ల అన్ని ముస్లిం దేశాలు కలిసి సామూహికంగా చర్చించి, ఆలోచించి, నిర్ణయాలు తీసుకోవాలి.

అదేవిధంగా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా పేర్కొంటున్నాడు:

اِنَّمَا الْمُؤْمِنُوْنَ اِخْوَةٌ فَاَصْلِحُوْا بَيْنَ اَخَوَيْكُمْ وَاتَّقُوا اللّٰهَ لَعَلَّكُمْ تُرْحَمُوْنَ۔

"నిశ్చయంగా విశ్వాసులందరూ సోదరులే. కాబట్టి మీ సోదరుల మధ్య సయోధ్యను నెలకొల్పండి మరియు అల్లాహ్‌కు భయపడండి, తద్వారా మీపై కరుణ చూపబడుతుంది." ( అల్-హుజురాత్ :11)

ముస్లింల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తినప్పటికీ, ఉదాహరణకు ఇరాన్ మరియు కొన్ని అరబ్ లేదా ఇతర ముస్లిం దేశాల మధ్య ఉన్నాయని చెప్పబడుతున్న విభేదాలు, వారు తమ ప్రాథమిక బంధం ఇస్లాంలోని సోదరభావమే అని గుర్తుంచు కోవాలి. చిన్న చిన్న వివాదాలు ఈ ఇస్లామీయ సౌభ్రాతృత్వ బంధాన్ని విచ్ఛిన్నం చేసే కారణంగా మారకూడదు. ముఖ్యంగా ముస్లిం దేశాలు ఈ విషయంపై అత్యంత జాగ్రత్త వహించాలి. లేకపోతే, నేను చెప్పినట్లుగా, ఇస్లాంకు వ్యతిరేకంగా ఉన్న శక్తులు ఈ పరిస్థితిని తమ ప్రయోజనానికి ఉపయోగించుకుంటాయి.

అందువల్ల, అరబ్ దేశాలు మరియు అదే విధంగా ఇరాన్ ప్రభుత్వం శాంతియుత పరిష్కారాన్ని కోరాలి. చైనా మరియు పాకిస్తాన్ సహా మరికొన్ని దేశాలు సయోధ్యను సులభతరం చేయడంలో తమ పాత్రను పోషించడానికి ముందుకు వచ్చాయి. ముస్లిం ప్రపంచం ఈ విషయాన్ని అర్థం చేసుకుంటే ఎంతో మంచిది. అల్లాహ్ వారికి జ్ఞానాన్ని ప్రసాదించుగాక!. ఏదేమైనా, మన బాధ్యత ముస్లిం ప్రపంచం కోసం, అలాగే నిరపరాధుల కోసం ప్రత్యేకంగా ప్రార్థించడం. ముఖ్యంగా రమజాన్ నెలలో, కేవలం వ్యక్తిగత ప్రార్థనలపైనే దృష్టి పెట్టకుండా, ముస్లిం ఉమ్మా (ముస్లిం సమాజం) కోసం కూడా దుఆలు చేయాలి.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి జ్ఞానాన్ని ప్రసాదించి, ప్రపంచంలో, ముఖ్యంగా ముస్లిం ప్రపంచంలో శాంతి నెలకొనేలా చేయుగాక!. ముస్లింలు పరస్పరం ఒకరి రక్తాన్ని మరొకరు చిందించకుండా ఉండుగాక!. ఒకరితో ఒకరు యుద్ధం చేస్తూ, అన్యాయంగా హత్యలు చేస్తున్నవారు తమ చర్యల ద్వారా అల్లాహ్ అసంతృప్తిని సంపాదిస్తున్నారు. అలాంటి వారు ఈ ప్రపంచంలోనే కాకుండా పరలోకంలో కూడా నష్టాన్ని అనుభవిస్తారు. కాబట్టి ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపడం అవసరం, అందుకోసం మనం ప్రత్యేకంగా ప్రార్థించాలి.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మనకు కూడా నిజాయితీతో, మనస్ఫూర్తిగా ప్రార్థించే సామర్థ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్.

ఈ రోజు నేను కొన్ని పరోక్ష అంత్యక్రియల నమాజ్‌ను కూడా చదివిస్తాను. వాటి గురించి కొన్ని వివరాలను ఇప్పుడు ప్రస్తావిస్తాను.

మొదటగా గౌరవనీయమైన రాజకుమారి అమతుల్ జమీల్ సాహిబా గారి గురించి ప్రస్తావించబడుతోంది. వారు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని (రజి) గారి చిన్న కుమార్తె మరియు శ్రీ॥శే॥ నాసిర్ ముహమ్మద్ సియాల్ సాహిబ్ గారి భార్య. వారు యునైటెడ్ కింగ్‌డమ్‌లో మిషనరీగా కూడా సేవలందించిన చౌధరి ఫతేహ్ ముహమ్మద్ సియాల్ సాహిబ్ (రజి) గారి కోడలు. వారు ఇటీవల సుమారు 89 సంవత్సరాల వయస్సులో పరమపదించారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. మృతురాలు మూసియా. వారు హజ్రత్ సయ్యిదా మర్యం బేగం సాహిబా (రజి) ఉమ్మె తాహిర్ గారి చిన్న కుమార్తె. అలాగే హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (ర.అ.) గారి పిల్లలందరిలో కూడా వారే చిన్నవారు. ఆమె నికాహ్‌ను 1955లో హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ప్రకటించారు. ఆ సమయంలో హుజూర్ రజి అనారోగ్యంతో ఉండటంతో మంచంపైనే పడుకుని నికాహ్ ఖుత్బా ఇచ్చి, దుఆ చేయించారు. ఆ సందర్భంలో కుటుంబ సభ్యులలో కొద్దిమంది మాత్రమే హాజరయ్యారు. ఈ సంఘటనను వివరించిన వ్యక్తి ఇలా తెలిపాడు. ఆ మొత్తం కార్యక్రమం అంతటా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని (రజి) గారి మీద ఒక ప్రత్యేకమైన ఆధ్యాత్మిక స్థితి కనిపించింది. అనంతరం 1956లో హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) స్వయంగా వారి వివాహ ఏర్పాట్లు చేసి, దుఆలతో వారికి వీడ్కోలు పలికారు. వారికి నలుగురు సంతానం ఉన్నారు. వారి పెద్ద కుమారుడు జైర్ ముస్తఫాను చిన్నతనంలోనే వారి సోదరి రాజకుమారి అమతుల్ ఖయ్యూమ్ సాహిబాకు అప్పగించారు. వారు అతన్ని చిన్నప్పటి నుంచే పెంచారు. ఒక కుమార్తె యాస్మీన్ మాలిక్ కెనడాలో నివసిస్తున్నారు. మరో కుమార్తె సాదియా అహ్మద్ యూకేలో నివసిస్తున్నారు. సోఫియా అహ్మద్ రబ్వాలో నివసిస్తున్నారు. సోఫియా గారు నాజిర్ ఖిద్మత్-ఎ-దర్వేషాన్‌గా సేవలందిస్తున్న మిర్జా సమద్ అహ్మద్ గారి భార్య.

వారి భర్త నాసిర్ ముహమ్మద్ సియాల్ సాహిబ్ ఒక జీవిత సమర్పితులు. హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఫజ్లే ఉమర్ రీసెర్చ్ ప్రాజెక్ట్‌ను ప్రారంభించినప్పుడు, సియాల్ సాహెబ్‌ను పరిశోధనా కార్యంలో నియమించారు. తరువాత ఆ ప్రాజెక్ట్ ముగిసినప్పుడు, జమాఅత్ వారికి ఇతర ఉద్యోగం చేసుకునేందుకు అనుమతి ఇచ్చింది.

వారి కుమార్తె సోఫియా ఇలా తెలిపారు. మృతురాలు పేదల పట్ల ఎంతో దయగలవారు. మరికొందరు కూడా వారిని గురించి రాస్తూ, వారు ప్రజల కష్టాలను అర్థం చేసుకొని, అవసరాల్లో ఉన్నవారికి సహాయం చేయడానికి ఎల్లప్పుడూ ప్రయత్నించే వారని పేర్కొన్నారు. వారి చిన్ననాటి జీవితం, అలాగే హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) గారితో వారికి సంబంధించిన కొన్ని సంఘటనలు మరియు హుజూర్ కలలలో వారి ప్రస్తావన వంటి విషయాలు కూడా నమోదు అయ్యాయి. ఈ విధంగా వారి జీవిత చరిత్ర ద్వారా ప్రారంభకాల చరిత్రకు సంబంధించిన కొన్ని అంశాలు కూడా వెలుగులోకి వస్తాయి.

వారు తన ఇంట్లో జరిగిన ఒక సంఘటనను వివరించారు. అది హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) గారు సూత్రాలకు ఎంత కట్టుబడి ఉండేవారో, అలాగే జమాఅత్ సేవకుల పట్ల ఎంత గౌరవం కలిగి ఉండేవారో చూపిస్తుంది.

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) గారి చెప్పులను పాలిష్ చేయడానికి బయట ఉంచేవారు. ఒకసారి వారు కూడా తన చెప్పులను అక్కడే వదిలారు. హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఆ చెప్పులను తీసుకొని ఇంట్లోకి వచ్చి, "ఈ చెప్పులు ఎవరివి?" అని అడిగారు. హుజూర్ కొంత అసంతృప్తిగా ఉన్నారు, కానీ ఎవరూ సమాధానం ఇవ్వలేదు. చివరకు హుజూర్ "సరే, ఇవి ఎవరివో చెప్పండి; నేను ఏమీ అనను" అన్నారు. వారు హుజూర్‌కు ఎంతో ప్రియమైనప్పటికీ, అవి తన చెప్పులేనని ఒప్పుకున్నారు. అప్పుడు హుజూర్ ఇలా అన్నారు:

"ఇక ముందు నువ్వు నీ చెప్పులను నీవే పాలిష్ చేసుకోలేకపోతే, నాకు ఇవ్వు. కానీ జమాఅత్‌లో పనిచేసే సేవకుడితో వాటిని పాలిష్ చేయించవద్దు."

వారు ఎంతో దాతృత్వ స్వభావం కలిగినవారు మరియు పేదల సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపేవారు. వారు కుమార్తె మరల ఇలా తెలిపారు. తన తల్లి ఖాతా పుస్తకాల మధ్య ఉన్న రికార్డులను చూసినప్పుడు, పేదలకు సహాయం చేయడానికి క్రమం తప్పకుండా చేసిన ఖర్చుల వివరాలు అందులో అనేకంగా కనిపించాయి.

మృతురాలు ఏడేళ్ల వయసులో ఉన్నప్పుడు, వారి తల్లి హజ్రత్ మర్యమ్ సాహిబా (ఉమ్మ్ తాహిర్ సాహిబా) మరణించారు. హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా వ్రాశారు:

"మేము ఆమె (హజ్రత్ మర్యమ్ సాహిబా) మృతదేహాన్ని షేక్ బషీర్ అహ్మద్ సాహిబ్ గారి ఇంటికి తీసుకువచ్చినప్పుడు, నా చిన్న కుమార్తె ఏడేళ్ల అమతుల్ జమీల్ (ఆమె మర్యమ్‌కు ఎంతో ప్రియమైనది, నాకు కూడా ఎంతో ప్రియమైనది) బిగ్గరగా ఏడుస్తూ 'హాయ్ అమ్మీ, హాయ్ అమ్మీ' అమ్మా! అమ్మా! అని కేకలు వేసింది. "నేను ఆమె దగ్గరకు వెళ్లి, 'జమ్మీ (మేము ప్రేమగా ఆమెను అలా పిలిచేవాళ్లం), నీ తల్లి అల్లాహ్ ఇంటికి వెళ్లిపోయింది. అక్కడ ఆమెకు చాలా ఎక్కువ సౌకర్యం ఉంటుంది. ఆమె అల్లాహ్ వద్దకు తిరిగి వెళ్లడం అల్లాహ్ సంకల్పం. చూడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా మరణించారు. మీ తాతగారు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారు కూడా మరణించారు. నీ తల్లి వారికంటే గొప్పదా?' అని చెప్పాను."

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా తెలిపారు. "అల్లాహ్ రక్షణ ఈ పిల్ల నుండి ఒక్క క్షణం కూడా తొలగిపోకూడదని నేను ప్రార్థిస్తున్నాను, ఎందుకంటే నేను ఆ మాటలు చెప్పగానే ఆమె తన తల్లి కోసం ఇకపై ఏడవలేదు. అవి పదాలు వినగానే ఆమె నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఈ స్థితి ఎంతగా కొనసాగిందనగా, మరుసటి రోజు అంత్యక్రియల ఊరేగింపులో, ఆమె పెద్ద అక్క దుఃఖంతో ఏడుస్తూ

**131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్ఫలితాలు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

**( నజారత్ ఇస్లాహ్ ఇర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్ )**

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలువు).**

స్పృహ కోల్పోయినప్పుడు, నా జిమ్మీ నా చిన్న భార్య మర్యమ్ సిద్దీఖా దగ్గరకు వెళ్లి 'చోటి అపా' (పిల్లలు హజ్రత్ మర్యమ్ సిద్దీఖా సాహిబాను చోటి అపా అని పిలిచేవారు) "నా అక్క ఎంత అజ్ఞానంగా ప్రవర్తిస్తోంది. నాన్న చెప్పారు కదా, మన అమ్మ మరణించడం అల్లాహ్ ఆజ్ఞ అని, అయినా ఆమె ఇంకా ఏడుస్తోంది." అని అన్నారు.

తరువాత హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా దుఆ చేశారు. "ఓ నా ప్రభువా! ఓ నా ప్రభువా! కేవలం నీ సంతృప్తి కోసం తన తల్లి మరణంపై ఒక్కసారి కూడా దుఃఖించని ఈ కుమార్తెకు పరలోకంలో ఏ వేదన, ఏ బాధ కూడా చేరనీయకుండా నీవు రక్షించుము." ఆ తరువాత హుజూర్ రజి గారు హజ్రత్ మర్యమ్(ఉమ్మె తాహిర్)సాహిబా కోసం ఇలా దుఆ చేశారు. "ఓ నా కరుణామయుడా! నీ దాసులకు నీపై ఇలాంటి ఆశ కలిగి ఉండటం వారి హక్కు, మరియు ఈ కోరికను నెరవేర్చడం నీకు అత్యంత తగినది."

(మేరీ మర్యమ్, అన్వార్-ఉల్-ఉలూమ్, సంపుటి 17, పేజీలు 365--366)

వారు క్రమం తప్పకుండా చందాలు చెల్లించేవారు. మరియు తన హిస్సా జాయిదాద్‌ను ముందుగానే పూర్తిగా చెల్లించారు. పొరుగు వారిలో ఒకరు మరణించినప్పుడు, వారు తరచుగా వారి కుటుంబానికి ఆహారం పంపించేవారు. వారిని కలిసిన వారికి, నాతో కూడా అనేకసార్లు "నా ముగింపు మంచిగా ఉండాలని దయచేసి దుఆ చేయండి" అని అనేవారు.

వారి మనవరాలు నుస్రత్ గారు ఇలా తెలిపారు. వారు నమాజ్ సమయానికి ముందే సిద్ధమై ఆ సమయం కోసం ఆత్రుతగా ఎదురుచూసేవారు. వారు సుదీర్ఘమైన దుఆలు చేసేవారు మరియు తాను ప్రార్థించాలనుకున్న వ్యక్తుల జాబితాను కూడా సిద్ధం చేసుకునేవారు. చిన్నపిల్లగా ఉన్నప్పుడు, వారి మనవరాలు కొన్నిసార్లు ఆ దీర్ఘమైన, హృదయపూర్వక దుఆలను విని ఆందోళన చెందానని చెప్పింది. అయినప్పటికీ, వారు మాత్రం ఆ వ్యక్తులందరి కోసం దుఆ చేసేవారు.

హాది అలీ సాహిబ్ కూడా వ్రాశారు. వారికి సంబంధించిన అనేక పాత జ్ఞాపకాలు మరియు సంఘటనలు ఉన్నాయి, వాటిలో హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) యొక్క కొన్ని దర్శనాలు కూడా ఉన్నాయి. ఆయన ఇలా చెప్పారు: "ఒకసారి వారు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని (రజి) తో కలిసి కారులో ప్రయాణిస్తున్నారు మరియు వెనుక సీటులో హుజూర్ పక్కనే కూర్చున్నారు. హుజూర్ తన వేళ్లపై ఏదో లెక్కపెడుతున్నారని వారు గమనించి, 'నాన్న గారు, మీరు ఏమి లెక్కపెడుతున్నారు?' అని అడిగింది.

"హుజూర్ ఇలా అన్నారు. 'ప్రపంచంలోని అన్ని దేశాలలో ఎంతమంది మిషనరీలు అవసరమో నేను అంచనా వేస్తున్నాను. ప్రపంచవ్యాప్తంగా కనీసం కొన్ని లక్షల మంది మిషనరీలు అవసరం. అప్పుడే మనం ఇస్లాం యొక్క నిజమైన బోధనలను ప్రపంచానికి చేరవేయగలం."

ఇది హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) గారి లోతైన ఆత్మీయతను ప్రతిబింబిస్తుంది, మరియు వారికి సంబంధించిన కొన్ని సుగుణాలు కూడా దీనికి సంబంధించినవే. వారితో సంబంధమున్న హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) గారి ఒక దైవస్వప్నాన్ని నేను ఇక్కడ ప్రస్తావించబోతున్నాను.

ఈ దైవస్వప్నం జూన్ 1948లో వచ్చింది. హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా తెలిపారు: "జూన్ నెలలో నేను సింధ్‌లోని నాసిరాబాద్‌లో ఉన్నాను. అక్కడ నాకు ఖాదియాన్‌లోని మినార్‌ను పోలిన ఒక చాలా ఎత్తైన తెల్లని మినార్ నిపించింది. కిందిస్థాయి బాల్కనీలో, ద్వారానికి సమీపంలో, నా కుమార్తె అమతుల్ జమీల్ ప్రశాంతంగా కూర్చుని ఉంది; ఆమె కాళ్లు అంచు బయటకు వేలాడుతున్నాయి. "అంతలో నా దృష్టి ఆ మినార్‌పై పడింది. అప్పుడే పై అంతస్తు ద్వారం నుండి ఒక చాలా పెద్ద పాము బయటకు రావడం నేను చూశాను. అది అనేక అడుగుల పొడవు, సుమారు ఒక అడుగు అర మందం కలిగి, పచ్చ రంగులో ఉంది. అది తన తలను పొడిగించి, క్రమంగా దిగువ అంతస్తు వైపు మెట్లు దిగడం ప్రారంభించింది." ఇది ఒక పొడవైన వర్ణన కావడంతో, సంక్షిప్తంగా చెప్పాలంటే, ఆ పాము దిగుతూ దిగుతూ చివరకు కిందిస్థాయికి ఒక అంతస్థు పైభాగానికి చేరుకుంది, ఆ తర్వాత దిగువ స్థాయి పైకప్పు వైపు తిరిగింది.

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) ఇలా అన్నారు:

"ఆ సమయంలో నా హృదయంలో ఈ ఆలోచన కలిగింది---అమతుల్ జమీల్ ద్వారం వద్ద కూర్చుంది, ఆ పాము తిరిగి ఆమెను కాటు వేయవచ్చు. అదే సమయంలో ఆమె ఒక్కసారిగా కదిలితే కిందపడిపోయి గాయపడే ప్రమాదముందని కూడా నేను భయపడ్డాను. అందువల్ల నేను అల్లాహ్ తఆలాను తీవ్రంగా ప్రార్థించడం ప్రారంభించాను." ఆ దుఆ పదాలు నాకు ఇలా గుర్తున్నాయి. అల్లాహుమ్మా అఇజ్‌హాలీ వలిల్ జమాఅతిల్ అహ్మదియ్యతి వలి ఘురబాఇహా అనగా "ఓ మా అల్లాహ్, నా కోసం, అహ్మదీయా జమాత్ కోసం మరియు దాని పేదల కోసం ఆమెకు గౌరవం మరియు రక్షణ ప్రసాదించు."

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) గారు రాశారు: అరబీలో "ఘురబా" అంటే ప్రయాణికులు అని అర్థం వస్తుంది, అయితే ఉర్దూలో అది పేదలు మరియు నిరాశ్రయులని సూచిస్తుంది. ఆ సందర్భంలో ఏ అర్థం ఉద్దేశించబడిందో లేదా ప్రయాణికులను కూడా సూచించిందో అల్లాహ్ తఆలాకే బాగా తెలుసు.

మరల ఇలా అన్నారు: "నేను ప్రార్థనలో కొనసాగుతుండగా, అమతుల్ జమీల్ ఆ ప్రమాదాన్ని గ్రహించినట్లు అనిపించి, ద్వారం వద్ద నుండి బాల్కనీ వెంట దూరంగా కదలడం ప్రారంభించింది. క్రమంగా ఆమె కొన్ని గజాల దూరం వెళ్లింది. ఇదే సమయంలో ఆ పాము ద్వారం ద్వారా దిగివచ్చి ఆమె వైపు తిరిగింది. కానీ అప్పటికే ఆమె దూరంగా ఉండటంతో అది ఆమెను వెంబడించలేదు. బదులుగా నేల వైపు దిగిపోయింది."

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రజి) గారు ఇలా రాశారు: "ఈ దైవ స్వప్నం ఆ బాలికకు ఎంతో శుభప్రదంగా అనిపిస్తోంది, ఎందుకంటే ఇందులో ఒక ప్రార్థన ఉంది. ఆమె నాకు ఓదార్పు కలిగించే కారణంగా ఉంటారు మరియు జమాత్‌కు, పేదలకు లాభదాయకంగా ఉంటారు. అల్లాహ్‌కు బాగా తెలుసు." (రుయా వ కషూఫ్ సయ్యదునా మహ్మూద్, పుటలు 416-417) ( అల్-ఫజల్, సంపుటి 2, సంఖ్య 287, 19 డిసెంబర్ 1948)

హజ్రత్ ముస్లెహ్-ఎ-మౌవూద్ (రహి) గారి ఇతర దైవ స్వప్నాలలో కూడా వారు ప్రస్తావించబడ్డారు. అల్లాహ్ తఆలా వారిని మన్నించి తన కరుణలో చేర్చుకొనుగాకా!.

రెండవ జనాజా నెదర్లాండ్స్‌కు చెందిన డాక్టర్ రషీద్ అహ్మద్ ఖాన్ సాహిబ్ గారిది. ఆయన గౌరవనీయులు నిజాముద్దీన్ సాహిబ్ గారి కుమారుడు. ఆయన ఇటీవల 91 ఏళ్ల వయసులో మృతి చెందారు. ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. అల్లాహ్ కృపతో ఆయన వసీయత్ చేశారు ఆయనకు నాలుగులు కుమారులు మరియు నాలుగులు కుమార్తెలు ఉన్నారు.

డాక్టర్ రషీద్ సాహిబ్ గారి తండ్రి నిజాముద్దీన్ సాహిబ్, ఫ్రాంటియర్ ప్రావిన్స్‌కు మాజీ అమీర్ అయిన డాక్టర్ ఫతేహుద్దీన్ సాహిబ్ గారి తమ్ముడు. వారి ద్వారా ఆ కుటుంబంలో అహ్మదీయత్ ప్రవేశించింది. 1905లో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) లూధియానాలో ఒక ప్రసంగం చేశారు. ఆ సమయంలో డాక్టర్ ఫతేహుద్దీన్ సాహిబ్ ఇంకా విద్యార్థిగానే ఉన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులను కఠినంగా హెచ్చరించి, "వారు ఒక మాంత్రికుడు, మీపై ప్రభావం చూపుతాడు" అంటూ వారి ఉపన్యాసానికి వెళ్లవద్దని చెప్పారు. ఇలాంటి ఆరోపణలు ఎప్పటి నుంచో ప్రవక్తలపై చేయబడుతున్నాయి. అలాగే హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) పై కూడా కొందరు మతపెద్దలు ఇలాంటి ఆరోపణలు చేశారు. అయినప్పటికీ ఫతేహుద్దీన్ సాహిబ్ ఆ ప్రసంగానికి హాజరయ్యారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గారి పవిత్ర ముఖకాంతిని చూసిన వెంటనే, చిన్న వయసులోనే ఆయన సత్యాన్ని గుర్తించి విశ్వసించారు. తరువాత తన విద్య పూర్తి చేసుకున్న తర్వాత, 1914లో హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి గారి కాలంలో బైఅత్ చేశారు.

మృతులు రషీద్ సాహిబ్ స్వభావంలో ధార్మికత కలవారు, మృదుస్వభావులు, స్నేహశీలులు, దైవభీతితో నిండినవారు, బంధువుల పట్ల బాధ్యత గలవారు, తనకు కష్టాలు వచ్చినా ఇతరుల కోసం సహించే స్వభావం కలవారు, ధైర్యవంతులు మరియు భయరహితులు. ఖిలాఫత్ పట్ల ఆయనకు ప్రగాఢమైన విశ్వాసం ఉండేది, త్యాగానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండేవారు. పేదలను సహాయపరచడం, అవసరమైన వారికి గోప్యంగా సహాయం చేయడం ఆయన అలవాటు. కొత్తగా అహ్మదీయులైన వారిపై ప్రత్యర్థులు తప్పుడు కేసులు పెట్టినప్పుడు, ఆయన వెళ్లి వారి బెయిల్ కోసం సహాయం చేసేవారు. ఆయన ఫుర్ఖాన్ ఫోర్స్‌లో కూడా సేవ చేశారు.

హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజి గారి కాలంలో వక్ఫ్-ఏ-జదీద్ పథకం కింద, ఆయనను తన మామ అబ్బాస్ ఖాన్ సాహిబ్ మరియు తన సోదరుడు మంజూర్ సాహిబ్‌తో కలిసి ఫ్రాంటియర్ ప్రావిన్స్‌లోని వివిధ ప్రాంతాలకు పంపించారు. అక్కడ పాత అహ్మదీ కుటుంబాలతో తిరిగి సంబంధాలు నెలకొల్పడం మరియు అహ్మదీయత్ సందేశాన్ని ప్రచారం చేయడం వారి బాధ్యతగా ఉండింది.

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)


Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

వారు ఆ పనిని ఎంతో చక్కగా నిర్వహించారు.

ప్రచారంపై ఆయనకు గొప్ప ఉత్సాహం ఉండేది. ఆయన ప్రయత్నాల వల్ల దౌలత్ ఖాన్ సాహిబ్ అనే ఒక వ్యక్తి అహ్మదీయత్‌ను స్వీకరించారు. తరువాత వారిపై ఒక కేసు నమోదైంది మరియు ఆయన అరెస్టయ్యారు. బెయిల్ ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాలేదు. అఫిడవిట్లు కూడా అంగీకరించబడని పరిస్థితిలో, రషీద్ సాహిబ్ స్వయంగా తన అల్లుడితో కలిసి అక్కడికి వెళ్లారు. అక్కడ సుమారు 5000 మంది మతపెద్దల గుంపు కూడి వారిపై రాళ్లు రువ్వడం ప్రారంభించింది. ఒక రాయి ఆయన అల్లుడి తలకు తగిలి, ఆయన కూలిపోయి, దారుణంగా కొట్టబడి అక్కడికక్కడే వీరమరణం పొందాడు. నివేదికల ప్రకారం, పోలీసులు కూడా ఆ శరీరాన్ని తన్నుతూ తాము "పుణ్యం పొందుతున్నాము" అని చెప్పినట్లు తెలిసింది.

రషీద్ సాహిబ్‌ను కూడా తీవ్రంగా కొట్టారు. ఆయన శరీరంలోని దాదాపు అన్ని ఎముకలు విరిగిపోయాయి మరియు అనేక గాయాలు అయ్యాయి. ఆ తరువాత నేను స్వయంగా ఆయన గాయాల మచ్చలను చూశాను; ఆయన ముఖంపై కూడా ముద్రలు ఉండేవి. ఆ గాయాల కారణంగా ఆయన చేతులు వంకరగా ఉండి పోయాయి. అయితే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనను రక్షించాడు. దాడి చేసిన వారు ఆయనను చనిపోయాడని భావించి వదిలేశారు.

పోలీసులు ఆయనను మృతదేహంగా భావించి ఆసుపత్రి వైపు తీసుకెళ్తూ ఉండగా, ఆసుపత్రి సమీపానికి చేరుకున్నప్పుడు ఆయన "నేను బతికే ఉన్నాను. నన్ను ఫలాన ప్రదేశానికి తీసుకెళ్లండి" అని చెప్పారు. ఆయన బ్రతికే ఉన్నాడని తెలుసుకొని వైద్యులు ఆశ్చర్యపోయారు.

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనను జీవించమని నిర్ణయించాడు. ఆ తరువాత 30 సంవత్సరాలకు పైగా ఆయన తన గాయాలున్నప్పటికీ జీవిస్తూ, చురుకుగా సేవలో నిమగ్నమై ఉన్నారు. శత్రుత్వం కారణంగా ప్రయాణం ప్రమాదకరమైనదైనా, ఆయన పోలీసులను పేశావర్‌కు తీసుకెళ్లమని అభ్యర్థించారు. ఆయన "మీరు ఎంత డబ్బు కావాలంటే అంత తీసుకోండి, కానీ నన్ను నా గమ్యస్థానానికి తీసుకెళ్లండి" అని అధికారులను ఒప్పించారు. ఆ అధికారి అంగీకరించి ఆయనను అక్కడికి తీసుకెళ్లాడు.

తరువాత ఆయన చికిత్స కోసం రబ్వాకు వెళ్లారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ కృపతో ఆయనకు ఒక కొత్త జీవితం ప్రసాదించబడింది. మృతదేహ శాలకు తీసుకెళ్లబడిన స్థితి నుండి, అల్లాహ్ ఆయనకు ఇంకా 30 సంవత్సరాలకు పైగా క్రియాశీల సేవ జీవితం ప్రసాదించాడు. తరువాత ఆయన నెదర్లాండ్స్‌కు వెళ్లి అక్కడ కూడా జమాత్ సేవ కొనసాగించారు. 1974లో, ప్రత్యర్థులు మళ్లీ ఆయనను తుపాకీ చూపిస్తూ బెదిరించారు. "కలిమా చదివి ముస్లింగా మారు" అని వారు అన్నారు. ఆయన ధైర్యంగా, "నేను ఇప్పటికే దానిని చదువుతున్నాను, దానిని నమ్ముతున్నాను కూడా. మరల నేను ఎలా ముస్లింగా మారాలి?" అని అన్నారు. తరువాత వారు ఆయనను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గురించి చెడుగా మాట్లాడమని డిమాండ్ చేశారు. ఆయన నిరాకరిస్తూ, "నేను దూషణ మాటలు మాట్లాడను. అది ఇస్లాం కాదు. నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)పై దురుద్దేశం లేకుండా దీవెనలు పంపుతాను మరియు ఆయన బోధనలను అనుసరిస్తాను. నేను అలాంటి పని చేయలేను" అని చెప్పారు.

తరువాత ఆయన ఒక సహచరుడి సంఘటనను వివరించారు. ఉహుద్ యుద్ధంలో ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) షహీదయ్యారని తప్పుడు వార్త విని, అతని చేతిలో ఉన్న ఒక ఖర్జూరాన్ని పక్కన పడేసి యుద్ధభూమిలోకి దూసుకెళ్లి, చివరకు షహీదయ్యాడని చెప్పారు. రషీద్ సాహిబ్ ఇలా అన్నారు: "మీకు నాకూ మధ్య ఒక ఖర్జూరం కూడా మిగలలేదు. ఎటువంటి దూరం లేదు. మీరు ఇప్పటికే తుపాకీని నా ఛాతీపై పెట్టారు. ట్రిగ్గర్ నొక్కి నన్ను షహీద్ చేయండి, కానీ నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) గురించి చెడుగా మాట్లాడను."ఇలా ఆయన అపారమైన ధైర్యాన్ని ప్రదర్శించారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆయనను మన్నించుగాకా! మరియు కరుణ ప్రసాదించుగాకా!. ఆయన స్థాయిని ఉన్నతం చేయుగాకా!. ఆయన సంతానాన్ని సత్య మార్గంలో స్థిరంగా ఉంచుగాకా!.

మూడవ జనాజ గౌరవనీయులైన జైనబ్ బీబీ సాహిబా గారిది. ఆమె, చక్ 275 కార్తార్‌పూర్‌లోని స్థానిక జమాత్ మాజీ అధ్యక్షుడు మరియు మస్జిద్ ఇమామ్ అయిన దివంగత బషీర్ అహ్మద్ సాహిబ్ గారి భార్య. ఆమె ఇటీవల 85 ఏళ్ల వయసులో మరణించారు. ఇన్నా లిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజివూన్. అల్లాహ్ కృపతో, ఆమె "మూసియ్యా". ఆమె తండ్రి అలీ ముహమ్మద్ సాహిబ్ ఫైసలాబాద్‌లోని మస్జిద్ దార్-ఉజ్-జిక్ర్‌కు సంరక్షకులుగా సేవలందించారు. వారు ప్రార్థనల్లో ఎంతో నిష్ఠ కలిగినవారు; తహజ్జుద్ నమాజ్‌ను క్రమం తప్పకుండా ఆచరించేవారు. దైనందిన నమాజులు మరియు పవిత్ర ఖుర్‌ఆన్ పఠనంలో నియమబద్ధంగా ఉండేవారు. ఆమె అతిథి సత్కారంలో ఎంతో ముందుండే వారు, ఖిలాఫత్ పట్ల ప్రగాఢమైన విశ్వాసాన్ని కలిగి ఉండేవారు, మరియు ఉన్నతమైన నైతిక స్వభావం కలిగినవారు. ఆమె పేదల పట్ల శ్రద్ధ చూపించేవారు మరియు ప్రతి శుక్రవారం ప్రసంగాన్ని తప్పకుండా విని, తన కుటుంబ సభ్యులను కూడగట్టి వారితో కలిసి వినేవారు.

ఆమెకు ముగ్గురు కుమారులు మరియు నలుగురు కుమార్తెలు జీవించి ఉన్నారు. ఆమె మనవళ్లలో కొందరు జీవితాన్ని సేవకు అంకితం చేసినవారు ఉన్నారు. ఆమె కుమార్తె అమతుల్ రషీద్ సాహిబా, జాంబియాలోని లుసాకాలో సేవలందిస్తున్న మిషనరీ తాహిర్ అహ్మద్ సైఫీ సాహిబ్ గారి భార్య. తల్లి మరణ సమయంలో ఆమె లుసాకాలో ఉండటం వల్ల అంత్యక్రియలకు హాజరు కాలేక పోయారు. అల్లాహ్ తఆలా ఆమెకు సహనం మరియు ధైర్యాన్ని ప్రసాదించుగాకా!, మరియు మృతురాలికి మన్నింపును మరియు కరుణను ప్రసాదించుగాకా!.

---

**(3వ పేజీ తరువాత)**

ఇస్లామాబాద్‌లో నిర్వహించబడే ఇలాంటి సమావేశాలు స్థానిక మరియు అంతర్జాతీయ సమాజాలను ఒకరికొకరు మరింత దగ్గర చేయడంలో, ప్రేమ మరియు పరస్పర గౌరవాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు. భిన్నమైన నేపథ్యాల నుండి వచ్చిన ప్రజలు ఒకేచోట కూర్చొని పరస్పరం చర్చించుకోవడం ద్వారా అపోహలు తొలగిపోతాయి మరియు ఒకరి బలాలు, బలహీనతలను మరొకరు అర్థం చేసుకునే అవకాశం లభిస్తుంది. ప్రపంచ శాంతి కోసం సంభాషణలు మరియు పరస్పర సంబంధాలు అత్యవసరమని, ఎందుకంటే ప్రజలు ఒకరినొకరు ఎంత ఎక్కువగా అర్థం చేసుకుంటారో అంత తక్కువగా సంఘర్షణలు జరుగుతాయని వారు నొక్కి చెప్పారు.

ఇద్దరు అతిథులు కూడా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ గారి ప్రసంగాన్ని ఈ కార్యక్రమంలో అత్యంత ప్రేరణాత్మక భాగంగా అభివర్ణించారు. కౌన్సిలర్ కేథరిన్ క్లార్క్ మాట్లాడుతూ, తనకు హుజూర్ గారిని వ్యక్తిగతంగా కలిసే గౌరవం కూడా లభించిందని, ఆ అనుభవాన్ని తాను ఎప్పటికీ మరిచిపోలేనిదిగా భావిస్తున్నానని చెప్పారు.

**జిల్ బార్‌స్టో, చర్చ్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ ఆఫ్ లాటర్-డే సెయింట్స్, ఇంటర్‌ఫెయిత్ మిల్టన్ కీన్స్ కన్వీనర్ ఇలా మాట్లాడారు.**

"హుజూర్ గారి ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉంది. ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితులపై వారికి క్షుణ్ణమైన అవగాహన ఉందని, వారి దృక్పథం ఎంతో విస్తృతమైందని స్పష్టంగా తెలిసింది. యుద్ధాలు, సంఘర్షణలు మరియు శాంతి యొక్క ప్రాముఖ్యత గురించి ఒక మత నాయకుడు ఇంత ధైర్యంగా, మనస్ఫూర్తిగా మాట్లాడటం వినడం నిజంగా ఎంతో ఆనందదాయకంగా అనిపించింది. ఇది నిజంగా ఆధ్యాత్మికంగా ఉత్తేజపరిచే కార్యక్రమం."

**సారా డే -- న్యూపోర్ట్ పాగ్నెల్ మేయరెస్:**

ఇలా అన్నారు: "ప్రసంగం మొత్తం నేను నిరంతరం తల ఊపుతూ ఉన్నాను, ఎందుకంటే చెప్పబడిన ప్రతి విషయంతో నేను పూర్తిగా ఏకీభవించాను. కొన్ని సంవత్సరాల క్రితం హుజూర్ గారు చేసిన ప్రసంగం కూడా నాకు గుర్తుకు వచ్చింది. వారు ఈ సందేశాలను చాలా కాలంగా అందిస్తూ వస్తున్నారు. వారిలో ఉన్న ఒక విశేష గుణం ఏమిటంటే, 'నేను ముందే హెచ్చరించాను' అని వారు ఎప్పుడూ చెప్పరు. కానీ నిజం ఏమిటంటే, వారు గతంలోనే హెచ్చరించారు, ఈరోజు కూడా మళ్లీ హెచ్చరించారు. వారు చెప్పిన ప్రతిదీ ఇప్పటికే మన కళ్లముందు జరుగుతోంది లేదా త్వరలో జరగబోతోంది. ఆ విషయం ఆలోచిస్తే భయంగా అనిపిస్తుంది. అయినప్పటికీ, ఆ ప్రసంగం అత్యంత ప్రభావవంతంగా మరియు హృదయాన్ని కదిలించే విధంగా ఉంది."

బదర్ సంపాదక వర్గం హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ గారికి మరియు అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ యూకేకు విజయవంతంగా నిర్వహించిన పీస్ సింపోజియం సందర్భంగా మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తోంది. అలాగే, హుజూర్ గారి శాంతి మరియు శుభాలతో నిండిన స్వరాన్ని ప్రపంచం వినేలా అల్లాహ్ తఆలా అనుగ్రహించాలని, ప్రపంచం శాంతి మరియు భద్రతలకు నిలయంగా మారాలని ప్రార్థిస్తోంది. అల్లాహుమ్మా ఆమీన్.

99633 83271 Pro. SK.Sultan 97014 62176
Oxygen Nursery
All kind of Plants are Available.
➤ Rajahmundry
➤ Kadiyapu lanka, E.G.dist.
➤ Andhra Pradesh 533126.
➤ #email. oxygennursery786@gmail.com
Love for All...Hatred for None

**వర్తమాన ఖలీఫా వాఖ్యములు**

**"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "**

**(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)**

దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)*

## సీరత్ ఖాతమున్నబియ్యీన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):–

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

ఖురైషులు:–

ఖురైష్ అనేది ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జన్మించిన తెగ పేరు. ఆ కాలంలో ఈ తెగ మక్కాలో నివసించేది. అరబ్బుల ఏకాభిప్రాయ సంప్రదాయాల ప్రకారం, ఈ తెగ ప్రవక్త ఇస్మాయీల్ (అలైహిస్సలాం) సంతతికి చెందినది మరియు అద్నానీ తెగల శాఖలలో ఒక శాఖగా పరిగణించబడుతుంది.

ఖురైష్ తెగ స్థాపకుని గురించి భిన్నమైన కథనాలు ఉన్నాయి. కొన్ని కథనాల ప్రకారం నద్ర్ ఇబ్ను కినానా ఈ తెగకు స్థాపకుడు కాగా, మరికొన్ని కథనాలు ఫిహ్ర్ ఇబ్ను మాలిక్ ను స్థాపకుడిగా పేర్కొంటాయి. అయితే ఈ భేదం చారిత్రక వాస్తవాలపై పెద్దగా ప్రభావం చూపదు. ఎందుకంటే నద్ర్ ఇబ్ను కినానాకు మాలిక్ ఇబ్ను నద్ర్ తప్ప వంశం కొనసాగిన మరే కుమారుడు లేడు. అలాగే మాలిక్‌కు కూడా ఫిహ్ర్ తప్ప వంశం కొనసాగిన మరే కుమారుడు లేడు. అందువల్ల ఆచరణాత్మకంగా చూస్తే, నద్ర్ సంతతి మరియు ఫిహ్ర్ సంతతి ఒకటే.

"ఖురైష్" అనే పేరుకు సంబంధించిన మూలం విషయంలో కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. కొందరి అభిప్రాయం ప్రకారం, ఇతర చేపలను మింగివేసే ఒక పెద్ద చేప పేరు అరబీ భాషలో "ఖురైష్" అని ఉండేది. ఆ చేపతో పోల్చి ఈ తెగకి ఆ పేరు పెట్టారని వారు భావిస్తారు. ఈ అభిప్రాయం ప్రకారం, ఆ పేరు తెగ యొక్క శక్తి మరియు అధికారం సూచిస్తుంది.

మరొక వర్గం ప్రకారం, కుసయ్యి కాబా సంరక్షణాధికారాన్ని పొందిన తర్వాత ఈ తెగలోని వివిధ శాఖలను ఒకచోట చేర్చి మక్కాలో స్థిరపరిచాడు. అప్పటి నుండి వారు "ఖురైష్" అని పిలవబడ్డారు. ఎందుకంటే అరబీ భాషలో "ఖురైష్" అనే పదానికి మూలమైన ధాతువులో "సమీకరించడం" లేదా "ఒకచోట చేర్చడం" అనే అర్థం కూడా ఉంది.

**ఖురైష్ తెగలోని అంతర్గత శాఖలు:–**

ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలానికి వచ్చేసరికి ఖురైష్ తెగ అనేక ఉపతెగలుగా విభజించబడింది. కొన్నిసార్లు వీరి మధ్య వివాదాలు తలెత్తేవి, అయితే అవి పూర్తి స్థాయి యుద్ధాలుగా మారలేదు.

ఈ ఉపతెగలలో కొన్ని మరియు వాటికి చెందిన ప్రముఖ వ్యక్తుల వంశవృక్షంలో "బను" ("అముకుల సంతానం" అనే అర్థంలో) అనే పదంతో ప్రారంభమయ్యే పేర్లు, ప్రవక్త కాలంలో ప్రసిద్ధి చెందిన ఖురైష్ ఉప తెగలు ప్రత్యేకంగా తమ వంశాన్ని అనుసంధానించుకున్న వ్యక్తులను సూచిస్తాయి. "బను" అనే పదం లేకుండా ఉన్న పేర్లు కేవలం ప్రముఖ వ్యక్తుల పేర్లు మాత్రమే.

గీతలతో చుట్టబడిన పేర్లు ప్రవక్త కాలంలో ప్రసిద్ధి చెందిన వ్యక్తులను సూచిస్తాయి. వారిలో ముస్లింల పేర్లు వృత్తాకార గుర్తులలో, ముస్లింలు కాని వారి పేర్లు చతురస్రాకార గుర్తులలో చూపబడతాయి.

అయితే ఈ వంశవృక్షంలో అన్ని పేర్లు చేర్చబడలేదు. కాబట్టి ఒకే వరుసలో కనిపించే పేర్లు తప్పనిసరిగా ఒకే తల్లిదండ్రులకు చెందినవని భావించకూడదు. అవి కేవలం ఒకే ఉప తెగకు చెందినవారని సూచించడమే ఉద్దేశ్యం.

**వంశావళిలో తెగ పేర్ల వినియోగం:–**

ఈ వంశావళిలో కొందరు వ్యక్తుల పేర్లకు ప్రత్యేకంగా ఏ తెగ అనుసంధానించబడ లేదని కనిపించవచ్చు, అయినప్పటికీ వారు ఖురైష్ ప్రజలలో ఎంతో ప్రసిద్ధులు. దీనికి కారణం అరబ్బులలో ఉన్న ఒక సంప్రదాయం. ఒక వ్యక్తి సంతానం ఐక్యంగా, సఖ్యతతో ఉన్నంతకాలం వారు తమను ఆ వ్యక్తి పేరుతోనే గుర్తించుకునే వారు. కానీ వారిలో శత్రుత్వం, పోటీ, విభేదాలు ఏర్పడినప్పుడు, పరస్పర విరోధి వర్గాలు ఒకే ఉమ్మడి పూర్వీకుడి పేరుతో తమను గుర్తించుకోవడాన్ని ఇష్టపడేవి కావు. బదులుగా, ఆ ఉమ్మడి పూర్వీకుడి తరువాతి తరాలలో ప్రసిద్ధి పొందిన మరొక వ్యక్తి పేరును తమ తెగ పేరుగా స్వీకరించేవారు.

అందుకే ఖుసయ్యి సంతానాన్ని సాధారణంగా "ఖుసయ్యి సంతానం" అని పిలవలేదు. వారిలో కొందరు బను హాషిమ్, మరికొందరు బను ఉమయ్యా, ఇంకొందరు బను అబ్దుద్-దార్ మొదలైన పేర్లతో ప్రసిద్ధి చెందారు. అయితే వీరిలో ఎవ్వరూ ఖుసయ్యి స్థాయిలో ఖ్యాతిని పొందలేదు.

**ఖుసయ్యి ఇబ్ను కిలాబ్:–**

నద్ర్ ఇబ్ను కినానా మరియు ఫిహ్ర్ ఇబ్ను మాలిక్ తమ తమ కాలాల్లో అత్యంత ప్రసిద్ధి గాంచిన, ప్రభావశీలులైన వ్యక్తులు. వారి తరువాత, క్రీస్తుశకం ఐదవ శతాబ్దంలో అంటే ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) జననానికి సుమారు 100--150 సంవత్సరాల ముందు ఖుసయ్యి ఇబ్ను కిలాబ్ ఖురైష్‌లలో గొప్ప అధికారాన్ని సంపాదించాడు.

అతను అసాధారణ ప్రతిభ కలిగిన వ్యక్తి. ఖుజాఅహ్ తెగ నుండి కాబా సంరక్షణ హక్కును ఎలా స్వాధీనం చేసుకున్నాడో, అలాగే ఖురైష్‌కు చెందిన అన్ని వంశాలను మక్కాలో ఏకీకృతం చేసి ఎలా స్థిరపరిచాడో ఇప్పటికే చెప్పబడింది. ఈ కారణంగా అతనికి ముజమ్మిఅ? ("సమీకరించేవాడు" లేదా "ఏకీకర్త") అనే బిరుదు కూడా లభించింది.

అయితే ఖుసయ్యి విజయాలు అక్కడితో ముగియలేదు. అతను తన ప్రజలను ఒక క్రమబద్ధమైన వ్యవస్థలో ఏర్పాటు చేసి, మక్కాలో ఒక ప్రజాస్వామ్య తరహా పరిపాలనకు పునాది వేశాడు. కాబా సంరక్షణతో పాటు ఖురైష్‌కు సంబంధించిన ఇతర పరిపాలనా బాధ్యతలను వివిధ పదవులుగా విభజించి, వాటిని ఖురైష్‌కు చెందిన వేర్వేరు వంశాధిపతులకు అప్పగించాడు.

కాబా పరిపాలనా పదవుల విభజన:–

ఈ వ్యవస్థలో క్రింది బాధ్యతలు ఏర్పాటు చేయబడ్డాయి:

1. సికాయహ్ (యాత్రికులకు నీటి ఏర్పాటు)

హజ్ రోజులలో యాత్రికులకు త్రాగునీరు అందించడం ఈ బాధ్యత. మక్కాలో నీరు చాలా కొరతగా ఉండేది. జమ్‌జమ్ బావి చాలా కాలంగా కనబడకుండా పోయింది. అది ఉన్నప్పటికీ, హజ్ సమయంలో అసాధారణ సంఖ్యలో యాత్రికులు రావడం వల్ల ప్రత్యేక ఏర్పాట్లు అవసరమయ్యేవి.

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలంలో ఈ బాధ్యత బను హాషిమ్ వద్ద ఉండేది. దీనిని అల్-అబ్బాస్ ఇబ్ను అబ్దుల్ ముత్తలిబ్ నిర్వహించేవారు.

2. రిఫాదహ్ (పేద యాత్రికులకు సహాయం)

హజ్ సమయంలో పేద యాత్రికులకు ఆర్థిక సహాయం అందించడం ఈ బాధ్యత. దీని కోసం ప్రతి సంవత్సరం ఖురైష్ ప్రజల నుండి నిధులు సేకరించబడేవి.

ప్రవక్త కాలంలో ఈ బాధ్యత బను నవ్ఫల్ వంశానికి చెందింది. దీనిని హారిస్ ఇబ్ను ఆమిర్ నిర్వహించేవారు.

3. హిజాబహ్ (కాబా సంరక్షణ మరియు తాళాల బాధ్యత)

కాబాను కాపాడటం మరియు దాని తాళాలను సంరక్షించడం ఈ పదవికి సంబంధించిన బాధ్యత.

ప్రవక్త కాలంలో ఈ బాధ్యత బను అబ్దుద్-దార్ వంశానికి చెందింది. దీనిని ఉస్మాన్ ఇబ్ను తలహా నిర్వహించేవారు.

ఈ మూడు పదవులను ఖుసయ్యి తన జీవితకాలంలో స్వయంగా నిర్వహించాడు.

ఖురైష్ పరిపాలనా వ్యవస్థ విభజన:–

ఖురైష్‌కు సంబంధించిన సాధారణ పరిపాలనా బాధ్యతలు ఈ విధంగా విభజించబడ్డాయి:

1. ఇకాబ్ (పతాకధారణ)

యుద్ధాలలో మరియు ఇతర ముఖ్య సందర్భాలలో జెండాను మోయడం.

మొదట ఈ బాధ్యత ఖుసయ్యి వద్ద ఉండేది. తరువాత ఇది బను అబ్దుద్-దార్‌కు వెళ్లింది. ప్రవక్త కాలంలో దీనిని తలహా ఇబ్నే అబీ తలహా నిర్వహించాడు. దీనిని లివా (పతాకం) అని కూడా పిలిచేవారు.

2. ఖియాదహ్ (సైనిక మరియు వాణిజ్య నాయకత్వం)

సైనిక దండయాత్రలు మరియు వ్యాపార బృందాలకు నాయకత్వం వహించడం.

ప్రవక్త కాలంలో ఈ బాధ్యత బను ఉమయ్యా వంశానికి చెందింది. దీనిని అబూ సుఫ్యాన్ నిర్వహించేవాడు.

3. సిఫారహ్ (రాయబార బాధ్యత)

అవసరమైనప్పుడు ఇతర తెగలు లేదా రాజ్యాల వద్దకు ఖురైష్ తరపున రాయబారిగా వెళ్లడం.

ప్రవక్త కాలంలో ఈ బాధ్యత బను అదీ వంశానికి చెందింది. దీనిని ఉమర్ ఇబ్ను అల్-ఖత్తాబ్ నిర్వహించేవారు.

**అహాదీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:

**"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."**

(కంజూలుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖరూజుల్ మహ్ది, 38671)

దుఆ ఆశించువారు: *Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)*

**అహాదీస్ బోధనలు**

**"ఒక ముసల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన ముసల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.**

(మిష్కాతుల్ మసాబీహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

దుఆ ఆశించువారు: *Muhammad Vazeer Ahmad sb*

4. దియ్యత్ మరియు మఘారిమ్ (నష్టపరిహారం మరియు మధ్యవర్తిత్వం)

తెగల మధ్య ఘర్షణల వల్ల కలిగే రక్తపరిహారం (బ్లడ్ మనీ) మరియు ఇతర బాధ్యతలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించడం.

ఈ బాధ్యత బను తైమ్ వంశానికి చెందింది. దీనిని అబూ బకర్ నిర్వహించేవారు.

5. ఖుబ్బహ్ (సైనిక శిబిర పరిపాలన)

యుద్ధ సమయంలో అశ్విక దళానికి నాయకత్వం వహించడం మరియు సైనిక శిబిరాల నిర్వహణ.

ఈ బాధ్యత మఖ్జూమ్ వంశానికి చెందింది. దీనిని అల్-వలీద్ ఇబ్నే అల్-ముగీరహ్ నిర్వహించేవాడు.

6. అజ్లామ్ (శకునాల నిర్వహణ)

చీటీలు వేయడం లేదా శకునాలను తెలుసుకునే సంప్రదాయాన్ని నిర్వహించడం.

ఈ బాధ్యత బను జుమహ్ వంశానికి చెందింది. దీనిని సఫ్వాన్ ఇబ్ను ఉమయ్యా నిర్వహించేవాడు.

7. మష్వరహ్ (సలహా మండలి)

ముఖ్యమైన సామూహిక విషయాలపై తెగల మధ్య సంప్రదింపులను నిర్వహించడం.

ఈ బాధ్యత బను అసద్ వంశానికి చెందింది. ప్రవక్త కాలంలో దీనిని యజీద్ ఇబ్ను రబీఅహ్ అల్-అస్వద్ నిర్వహించేవాడు.

8. ఖదా (న్యాయాధికారం)

వివాదాలు మరియు న్యాయపరమైన కేసులను తీర్పు చేయడం.

ఈ బాధ్యత బను సహ్మ్ వంశానికి చెందింది. దీనిని హారిస్ ఇబ్ను ఖైస్ నిర్వహించేవాడు.

ఇలా మరెన్నో పదవులు ఉండేవి.

దార్ అన్-నద్వహ్:-

ఖుసయ్యి కాబా సమీపంలో దార్ అన్-నద్వహ్ అనే భవనాన్ని కూడా నిర్మించాడు. ఇది ఖురైష్ ప్రజలు తమ సామూహిక వ్యవహారాలను నిర్వహించే కేంద్రంగా ఉండేది. వారి నాయకులు ఇక్కడ సమావేశమై ముఖ్యమైన విషయాలపై సంప్రదించేవారు. ఇది ఖురైష్‌లకు ఒక విధమైన “సభాభవనం” (కౌన్సిల్ హాల్) వంటిది.

హిజ్రత్‌కు ముందు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)ను హత్య చేయాలనే నిర్ణయాన్ని కూడా ఖురైష్ నాయకులు ఇదే దార్ అన్-నద్వహ్‌లో తీసుకున్నారు.

ఈ సభలో పాల్గొనడానికి కనీసం నలభై సంవత్సరాల వయస్సు ఉండాలి అనే నిబంధన ఉండేది. వివాహాలు మరియు ఇతర సామాజిక కార్యక్రమాల కోసం కూడా ఖురైష్ ప్రజలు ఇక్కడే కూడేవారు. యుద్ధ యాత్రలు లేదా వ్యాపార బృంధాలు బయలుదేరే ముందు ప్రజలు అక్కడ ఏకమై అక్కడి నుంచే ప్రయాణం ప్రారంభించేవారు.

దార్ అన్-నద్వహ్ పరిపాలనను ఖుసయ్యి తన చేతుల్లోనే ఉంచుకున్నాడు.

ఖుసయ్యి సాధించిన ఈ విశేష విజయాలు అతన్ని మొత్తం అరేబియాలో ప్రసిద్ధుడిని చేశాయి. ఖురైష్‌లలో అతను ఒక విధముగా రాజు వలె గౌరవించబడ్డాడు. అయితే దీనిని ఖురైష్‌లకు ఒక అధికారిక రాజ్యపాలన వ్యవస్థ ఉండేదని లేదా ప్రజల స్వేచ్ఛపై కఠిన పరిమితులు ఉండేవని అర్థం చేసుకోరాదు.

ఈ వ్యవస్థ ప్రధానంగా సామూహిక మరియు ముఖ్యమైన విషయాలను సులభంగా నిర్వహించేందుకు రూపొందించబడింది. అలాగే ఈ బాధ్యతలన్నింటినీ ఖుసయ్యి స్వయంగా పూర్తిగా ఏర్పాటు చేశాడని కూడా భావించనవసరం లేదు. కొన్ని పదవులు అతని కంటే ముందే ఉండవచ్చు. మరికొన్ని అవసరానుసారం తరువాత ఏర్పడి ఉండవచ్చు. అయినప్పటికీ, ఈ మొత్తం వ్యవస్థకు మూలపునాది వేసింది ఖుసయ్యినే అనడంలో సందేహం లేదు.

**ఉపశాఖల వార్షిక సమావేశాలు ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు మజ్లిస్ అన్సారుల్లాహ్, ఖుద్దాముల్ అహ్మదియ్య, అత్ఫాలుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

హుజూర్ అన్వర్ గారు సూచించిన కొన్ని సూచనలు:-

ప్రశ్న: హుజూర్ అన్వర్ జమాఅత్ సభ్యులను ఏమే దుఆలు చేయాలని సూచించారు?.

సమాధానం: హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు. దుఆలో అందరు జల్సాలో పాల్గొన్నవారందరికి జల్సా శుభములను అనుగ్రహించమని, ప్రతి ఒక్కరికి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం దుఆల వారసులుగా చేయమని, త్వరగా ప్రపంచంలో శాంతిని స్థాపించమని తద్వార మనం విశ్వత స్థాయిలో మన జల్సాలను నిర్వహించుకొనుటకు, అంతే వైభవంగా అన్ని రకాల చింతనల నుండి విముక్తిని పొంది జల్సాను నిర్వహించుకొనుటకు అవకాశాన్ని కల్పించమని దుఆలు చేయండి. అదే విధముగా ఈ జల్సాలు మన ఆధ్యాత్మిక మరియు విజ్ఞాన దాహాన్ని తీర్చు అవకాశాన్ని కల్పించుగాకా!. మరియు వాస్తవానికి కూడతమ జీవితాలను ఇస్లామీయ బోధనలకు అనుగుణముగా అలవర్చుకొను భాగ్యాన్ని కల్పించుగాకా!. అల్లాహ్ తలాలా ప్రేమానురాగాలను పొందువారము అవుదుము గాకా!? అల్లాహ్ తాలా ఇందుకు మనకు అనుగ్రహాన్ని కల్పించుగాకా!.

ప్రశ్న: మనకు ఎప్పుడు అల్లాహ్ తాలా ప్రీతి లభిస్తుంది?.

సమాధానం: హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ ఇలా తెలిపారు: ఈ విధానంను మనం ఎల్లప్పుడు మనం ముందు ఉంచుకుంటూ ఈ విధముగా ఆలోచించాలి. అనగా ఒకవేళ మనం కేవలం మన కోసం, మన జాతి ప్రజల కోసం, మన దేశ ప్రజల కోసం మాత్రమే సుఖ శాంతులను కోరుకున్నట్లైతే ఇలాంటి స్థితిలో మనకు ఎన్నడు అల్లాహ్ తాలా యొక్క సహాయ సహకారాలు లభించవు. అతని ప్రీతి ఎన్నడు మనకు దక్కదు. కాని మనం ప్రతి పని అల్లాహ్ తాలా ప్రీతి కొరకే చేయాలనే భావనలను కల్గియున్నప్పుడు మాత్రమే నిజమైన సుఖ శాంతులు నెలకొంటాయి. లేనిచో ఎన్నడు నెలకొనలేవు.

ప్రశ్న: ప్రపంచంలో నేడు జరుగుతున్న యుద్ధాలకు గల కారణాలు ఏమిటి?.

సమాధానం: హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా ఈ విధముగా తెలిపారు. ప్రపంచంలో నేడు జరుగుతున్న యుద్ధాలకు , తగాదలు, అల్లరులకు గల కారణం మానవుని ఉద్దేశాలు సరిగా లేక పోవడమే.

ప్రశ్న: ఎవరి ద్వారా మనం అల్లాహ్‌తాలా అనుగ్రహాన్ని మరియు అతని అనుసరణను పొందగలము?.

సమాధానం: హుజూర్ అన్వర్ ఇలా తెలిపారు: అల్లాహ్ తాలా ఆఁ హజ్రత్ఁ సల్లల్లాహు అలైహి వసల్లంపై అవతరింపజేసిన బోధనలలో ఇలా తెలిపాడు. అనగా ఖద్ జాఅకుం మ్మినల్లాహి నూరున్ వ్వ కితాబున్ మ్ముబీయిన్ యహదీ బిహి ల్లాహు మనిత్తబఅ రిజ్వానహు సుబులస్సలామి (మాయిదా: 16-17) అనగా నిశ్చయముగా మీ వద్దకు అల్లాహ్ నుండి ఒక తేజస్సు వచ్చింది. మరియు ఒక ప్రకాశవంతమైన గ్రంథము అవతరించింది. అల్లాహ్ తాలా వాటి ద్వారా ఎవరైతే అతని అనుగ్రహమును ఆశించుతారో వారికి సురక్షితమైన మార్గముల వైపు మార్గదర్శకం చేయును.

**ప్రపంచ అహ్మదీయ్య జమాఅత్ సభ్యులకు ఒక ముఖ్య ప్రకటన:**

మన ప్రియతమ ఖలీఫా, అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి శుభప్రదమైన సూచన మేరకు తమను తాము ఆధ్యాత్మికపరమైన పటిష్టమైన కోటలో చేర్చుకొనుటకు ఈ రోజు మీరు ఈ క్రింది దుఆలను పఠించారా?.

(1) سُبْحَانَ اللهِ وَبِحَمْدِهٖ سُبْحَانَ اللهِ الْعَظِيْمِ اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّاٰلِ مُحَمَّدٍ

సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీమ్ అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వ్వ అలే ముహమ్మద్. (200 సార్లు పఠించవలెను)

(2) اَسْتَغْفِرُ اللهَ رَبِّيْ مِنْ كُلِّ ذَنْبٍ وَّاَتُوْبُ اِلَيْهِ

అస్తఘ్‌ఫిరుల్లాహ రబ్బి మిన్‌కుల్లి జన్‌బిన్ వ్వఅతూబు ఇలైహి.

**100 సార్లు పఠించవలెను.**

(3) رَبِّ كُلُّ شَيْءٍ خَادِمُكَ رَبِّ فَاحْفَظْنِيْ وَانْصُرْنِيْ وَارْحَمْنِيْ

రబ్బికుల్లి షైయిన్ ఖాదిముక రబ్బి ఫాహ్‌ఫజ్‌నీ వన్‌సుర్‌నీ వర్‌హమ్‌నీ.

**100 సార్లు పఠించవలెను.**

(25 సం॥పైబడిన వారు పైన పేర్కొనబడినట్లుగా పఠించవలెను. 15 నుండి 25 సం॥ల వారు 100సార్లు, 15సం॥ల కంటే తక్కువ వయస్సు గలవారు 33 సార్లు, చిన్న పిల్లల తరుపున వారి తల్లిదండ్రులు 3నుండి 4 సార్లు పఠిస్తూ, పిల్లలతో కూడ పఠింపజేయవలెను.)

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817

Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక

Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA

POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 18 JUN 2026, Issue No - 25

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

## సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.

**19 అక్టోబర్, శనివారం, 2013:- (గత సంచిక తరువాత)**

ఆమీన్ కార్యక్రమం:-

ఆ తరువాత హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ (అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు) బైతుల్ హుదా మస్జిద్‌కు విచ్చేశారు. అక్కడ ఆమీన్ కార్యక్రమం నిర్వహించబడింది.

హుజూర్ అన్వర్ గారు ఈ క్రింద పేర్కొనబడిన బాలురు మరియు బాలికలలో ఒక్కొక్కరు ఖుర్ఆన్ కరీమ్‌లోని ఒక్కొక్క సూక్తిని పారాయణం చేయగా విన్నారు. అనంతరం దుఆ చేశారు.

ఈ కార్యక్రమంలో పాల్గొనే భాగ్యం పొందిన అదృష్టవంతులైన పిల్లలు:

బాలురు: బిలాల్ అహసన్, తాహా అహ్మద్, రావైల్ చౌధరీ, ఇమ్రాన్ అహ్మద్, షహ్జాద్ అహ్మద్, ఫరాన్ అహ్మద్, ఆలి షాన్, సయ్యద్ ముజ్తబా షా, జలీలుర్రహ్మాన్, రబీత్ నిసార్, జీషాన్ షాహిద్.

బాలికలు: షాఫియా రహ్మాన్, సబీహా రహ్మాన్, వార్దా అహ్మద్, ఆయేషా చౌధరీ, షాయిస్తా మహ్మూద్, నమూదుస్సహర్, మర్యం సింధు, జుహా తారిఖ్, సనా తాజ్, నాదియా మర్యం, జారా రహ్మత్, సమావియా నుజ్హత్, షెహ్నాజ్ సయ్యద్.

తరువాత రాత్రి 9:00 గంటలకు హుజూర్ అన్వర్ మగ్రిబ్ మరియు ఇషా నమాజులను కలిపి చదివించారు. నమాజ్‌ల అనంతరం హుజూర్ అన్వర్ తన నివాసానికి తిరిగి వెళ్లారు.

**ఆదివారం, 20 అక్టోబర్ 2013:-**

ఉదయం 5:10 గంటలకు హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ గారు బైతుల్ హుదా మస్జిద్‌కు విచ్చేసి ఫజర్ నమాజును చదివించారు. నమాజు అనంతరం హుజూర్ గారు తన నివాసానికి తిరిగి వెళ్లారు.

ఉదయం సమయంలో హుజూర్ గారు అధికారిక ఉత్తరాలు మరియు నివేదికలను పరిశీలించి అవసరమైన మార్గదర్శకాలను అందించారు.

**వ్యక్తిగత మరియు కుటుంబ సమావేశాలు:-**

కార్యక్రమం ప్రకారం ఉదయం 11:00 గంటలకు హుజూర్ గారు తన కార్యాలయానికి విచ్చేసి కుటుంబ సమావేశాలను ప్రారంభించారు. ఈ ఉదయపు సమావేశంలో మొత్తం 48 కుటుంబాలకు చెందిన 179 మంది సభ్యులు తమ ప్రియమైన ఇమామ్‌ను కలుసుకునే భాగ్యం పొందారు.

ఈ కుటుంబాలు సిడ్నీలోని మూడు జమాఅత్‌లైన మార్స్‌డెన్ పార్క్, బ్లాక్‌టౌన్ మరియు మౌంట్ డ్రూయిట్ ప్రాంతాల నుండి వచ్చాయి.

వారందరూ హుజూర్ గారితో ఫోటోలు దిగారు, దువాల కోసం అభ్యర్థించారు మరియు హుజూర్ గారి దుఆల ద్వారా అనేక శుభములను పొందారు. హుజూర్ గారు చదువుకుంటున్న బాల, బాలికలకు ప్రేమపూర్వకంగా పెన్నులు బహుమతిగా అందించగా, చిన్నపిల్లలకు చాక్లెట్లు పంపిణీ చేశారు.

సమావేశాల ముగింపులో ఆస్ట్రేలియా అమీర్ మరియు మిషనరీ ఇన్‌చార్జ్ మహ్మూద్ అహ్మద్ షాహిద్ సాహెబ్ హుజూర్ గారిని అధికారికంగా కలుసుకుని వివిధ అంశాలపై మార్గదర్శకత పొందారు.

ఈ సమావేశాలు మధ్యాహ్నం 2:30 గంటల వరకు కొనసాగాయి. అనంతరం హుజూర్ గారు బైతుల్ హుదా మస్జిద్‌కు వెళ్లి జుహర్ మరియు అసర్ నమాజులను కలిపి చదివించారు. నమాజుల అనంతరం హుజూర్ గారు తన నివాసానికి తిరిగి వెళ్లారు.

**ఖుద్దాముల్ అహ్మదీయా ఆస్ట్రేలియా జాతీయ మజ్లిస్ ఆమిలా సమావేశం:-**

సాయంత్రం 6:15 గంటలకు హుజూర్ గారు బైతుల్ హుదా మస్జిద్‌కు విచ్చేశారు. అక్కడ ఖుద్దాముల్ అహ్మదీయా ఆస్ట్రేలియా జాతీయ మజ్లిస్ ఆమిలా (కార్యవర్గం) సమావేశం ప్రారంభమైంది. హుజూర్ గారు దుఆతో సమావేశాన్ని ప్రారంభించారు.

హుజూర్ గారు ప్రధాన కార్యదర్శిని ప్రశ్నించారు:"మీ వద్ద ఎన్ని స్థానిక మజాలిస్ (శాఖలు) ఉన్నాయి? అవన్నీ నెలవారీ నివేదికలను పంపిస్తున్నాయా? ఆ నివేదికలపై చేసిన సమీక్షలను తిరిగి వారికి పంపబడుతున్నాయా?"

ప్రధాన కార్యదర్శి సమాధానమిస్తూ మొత్తం 13 మజాలిస్ ఉన్నాయని, అవన్నీ తమ నివేదికలను పంపిస్తున్నాయని, సంబంధిత కార్యదర్శులు వాటిపై వ్యాఖ్యలను వ్రాసి తిరిగి పంపుతున్నారని తెలిపారు.

దీనిపై హుజూర్ గారు ఇలా సూచించారు:

"ఖుద్దాముల్ అహ్మదీయా సదర్ (జాతీయ అధ్యక్షుడు) కూడా ఈ నివేదికలను చదవాలి మరియు తన అభిప్రాయాలను పంపాలి. మజాలిస్ ఏమి చేస్తున్నాయో, వారి పనుల్లో లేదా కార్యక్రమాల అమలులో ఎక్కడ లోపాలు ఉన్నాయో ఆయనకు పూర్తిగా తెలిసి ఉండాలి."

మొదటి ఉపాధ్యక్షుడు మరియు ఆర్థిక కార్యదర్శి నివేదిక సమర్పిస్తూ, ఖుద్దాముల్ అహ్మదీయా వార్షిక బడ్జెట్ 210,552 డాలర్లు కాగా, అల్లాహ్ అనుగ్రహంతో వసూళ్లు 213,000 డాలర్లకు పైగా జరిగాయని తెలిపారు.

హుజూర్ గారు ప్రశ్నించగా, ఆర్థిక కార్యదర్శి, ఎక్కువ మంది ఖుద్దామ్ తమ ఆదాయానికి అనుగుణంగా చందాను సక్రమంగా చెల్లిస్తున్నారని చెప్పారు. కేవలం సుమారు 40 మంది మాత్రమే ఇంకా చందా చెల్లించడం ప్రారంభించలేదని, అలాగే 778 మంది ఖుద్దామ్ ఆర్థిక రికార్డుల్లో చందాదారులుగా నమోదై ఉన్నారని తెలిపారు.

తరువాత, హుజూర్ గారు సభ్యత్వ రికార్డుల (తజ్నీద్) కార్యదర్శిని మొత్తం సభ్యుల సంఖ్య గురించి అడిగారు. ఆయన మొత్తం సభ్యత్వం 830 అని తెలిపారు.

దీనిపై హుజూర్ గారు ఇలా వ్యాఖ్యానించారు:

"అంటే చందా చెల్లించని వారు కూడా సభ్యత్వ జాబితాలో ఉన్నారు, కానీ ఇంకా ఆర్థిక వ్యవస్థలో భాగం కాలేదు."

రెండవ ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ, సదర్ అప్పగించే అన్ని బాధ్యతలను తాను నిర్వర్తిస్తున్నానని, ప్రస్తుతం జల్సా సాలానా మరియు హుజూర్ పర్యటనకు సంబంధించిన పనుల్లో నిమగ్నమై ఉన్నానని తెలిపారు.

ఖిద్మత్-ఎ-ఖల్క్ (మానవతా సేవలు) కార్యదర్శి నివేదిక సమర్పిస్తూ, 337 మంది ఖుద్దామ్ రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారని తెలిపారు.

దీనిపై హుజూర్ గారు ఇలా అన్నారు:

" అహ్మదీయేతరులు, ఇరుగు పొరుగువారు మరియు సమాజంలోని ఇతరులు కూడా పాల్గొనే విధంగా రక్తదాన కార్యక్రమాలను నిర్వహించండి. యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఇలాంటి కార్యక్రమాలు ఈ విధంగానే నిర్వహిస్తారు. ఆసుపత్రుల అంబులెన్సులు మరియు వైద్య బృందాలు కూడా వస్తాయి. దీని ద్వారా జమాఅత్ గురించి ప్రజలకు పరిచయం కలుగుతుంది."

హుజూర్ గారు మరల ఇలా అన్నారు:

"ఈ సేవా కార్యక్రమాలను మీ వరకే పరిమితం చేసుకోవద్దు. ఇతరులను కూడా భాగస్వాములుగా చేసుకోండి, వారు వేల సంఖ్యలో ఉన్నా సరే. కార్యక్రమం మీదై ఉంటుంది, మీడియా ప్రచారం కూడా మీ పేరుతోనే ఉంటుంది. కానీ పెద్ద సంఖ్యలో ఇతరులను చేర్చడం ద్వారా మీరు జమాఅత్‌ను విస్తృత స్థాయిలో పరిచయం చేయడమే కాకుండా అహ్మదీయత్ బోధనలు మరియు సందేశాన్ని కూడా వారికి చేరవేసిన వారవుతారు."

హుజూర్ గారు మరల ఇలా అన్నారు:

"చారిటీ వాక్‌లను కూడా నిర్వహించండి మరియు అందులో సభ్యత్వం లేని వారిని కూడా చేర్చండి. దీని ద్వారా 'సమాజంలో సమన్వయం జరగడం లేదు' అనే విమర్శ తొలగిపోతుంది. అందువల్ల ఇలాంటి దాతృత్వ కార్యక్రమాలలో ఇతరులను కూడా చేర్చండి."

విద్యా కార్యదర్శి నివేదిక సమర్పిస్తూ, ప్రతి సంవత్సరం నిర్దేశిత పాఠ్యాంశం ఆధారంగా రెండు పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

హుజూర్ గారు సూచిస్తూ ఇలా అన్నారు:

"పరీక్షల పాఠ్యాంశంలో హజ్రత్ మసీహ్ మౌద్ (అ.స.) గారి ఒక పుస్తకాన్ని చేర్చండి. ఇంగ్లీష్ మాట్లాడే ఖుద్దామ్ కోసం ఆ పుస్తకానికి ఇంగ్లీష్ అనువాదాన్ని ఉపయోగించండి. హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గారి అనేక గ్రంథాలు ఇంగ్లీష్‌లోకి అనువదించబడ్డాయి. వాటిలో ఒకదాన్ని ఎంపిక చేసుకోండి. పుస్తకం పెద్దదైతే దాన్ని రెండు లేదా మూడు భాగాలుగా విభజించండి. ఇంగ్లీష్ తెలిసిన కొత్త తరం ఎదుగుతోంది. వారిలో హజ్రత్ మసీహ్ మౌవూద్ (అ) గ్రంథాలను అధ్యయనం చేసే ఆసక్తిని పెంపొందించండి. ఈ విధంగా పరీక్షలు నిర్వహించడం ద్వారా వారు వాటిని చదివి మరింత అధ్యయనం చేయాలనే ఆసక్తిని పొందుతారు. అలాగే వీలైనంత ఎక్కువ మంది ఖుద్దామ్ పరీక్షల్లో పాల్గొనేలా చూడండి."

తర్బియత్ (నైతిక శిక్షణ) కార్యదర్శిని ఉద్దేశించి హుజూర్ గారు ఇలా అన్నారు: "ఖుద్దామ్ యొక్క నైతిక శిక్షణపై దృష్టి పెట్టండి. వివాహాలు విచ్ఛిన్నమవుతున్న చోట సయోధ్య మరియు సంస్కరణ కోసం ప్రయత్నాలు చేయాలి. కుటుంబ వివాదాలను సాధ్యమైనంత వరకు తగ్గించాలి. యువకులు తప్పు చేసినప్పుడు వారికి సలహా ఇవ్వండి, సంస్కరించండి మరియు సరైన శిక్షణ ఇవ్వండి."(తదుపరి సంచికలో)

**(అల్ ఫజల్ ఇంటర్నేషనల్, 13--19 డిసెంబర్ 2013)**

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz